- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
09-06-2026

సంపుటి : 01 సంచిక :78 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.





Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 78 NAMASTEY MAHAAPRABHA


## పెళ్లికి ముందు ఇద్దరు మేజర్ల ఇష్టపూర్వక
# శారీరక బంధాన్ని తప్పుపట్టలేం



- ప్రేమ విఫలమైతే మోసం చేసినట్టే అనలేమన్న ధర్మాసనం
- పాత కేసు ఆధారంగా ఉద్యోగ రద్దు చెల్లదని స్పష్టీకరణ
- లోక్ అదాలత్ రాజీని తప్పు ఒప్పుకున్నట్టుగా చూడొద్దు
- తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్ణయానికి సుప్రీంకోర్టు చెక్

న్యూఢిల్లీ: 8 జూన్ (మహాప్రభ)
ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా పెళ్లికిముందే శారీరక సంబంధం పెట్టుకుంటే వారి ప్రవర్తన లేదా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమని సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పరస్పర అంగీకారంతో సాగిన ఇలాంటి సంబంధాలను చట్టం ఏమాత్రం నిషేధించలేదని స్పష్టంచేసింది. తెలంగాణకు చెందిన గాజుల తిరుపతి అనే వ్యక్తి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే పెళ్లికి ముందు -మిగతా 3 లో

## అణ్వస్త్రాల సంఖ్య పెంచుకుంటున్న
# ఇండియా, పాక్



- భారత్ వద్ద 190.. పాక్ వద్ద 170 అణ్వస్త్రాలు
- కొత్త తరహా వార్‌హెడ్ వ్యవస్థల అభివృద్ధి
- చైనా నిల్వలు 620కు.. వేగంగా పెరుగుతున్న శక్తి
- ప్రపంచంలో 12,187 అణ్వస్త్రాలు: SIPRI నివేదిక

న్యూఢిల్లీ: 8 జూన్ (మహాప్రభ)
2025లో భారత్, పాకిస్థాన్ దేశాలు కొత్త తరహా అణ్వాయుధ డెలివరీ వ్యవస్థలను అభివృద్ధి చేసినట్లు ఓ నివేది ద్వారా తెలిసింది. బాలిస్టిక్ క్షిపణులకు వార్‌హెడ్స్‌ను అమర్చే సామర్థ్యాన్ని కూడా ఆ దేశాలు పెంచుకున్నట్లు స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసర్చ్ -మిగతా 3 లో



## తెలంగాణలో
# 'నాలెడ్జ్' విప్లవం

- రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్
- రూ..25 కోట్లతో ఎస్సీ హాస్టల్ పునరుద్ధరణ
- ఉద్యోగాల నోటిఫికేషన్లతో పాటు ఉచిత డిజిటల్ కోచింగ్
- సంక్షేమ రాజ్య నిర్మాణం.. ప్రజాప్రభుత్వ లక్ష్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, 8 జూన్ (మహాప్రభ)
ప్రజా ప్రభుత్వం తెలంగాణలో సంక్షేమ రాజ్యం నిర్మించేదిశగా కృత నిశ్చయంతో పనిచేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు. లోయర్ ట్యాంక్ బండ వద్ద రూ.110 కోట్ల అంచనాలతో నిర్మించనున్న బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్, నింబోలి అడ్డా వద్ద రూ. 25 కోట్ల అంచనాలతో నిర్మించనున్న ఎస్సీ హాస్టల్ కు సబంధించి స్థల పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ రెండు భవనాలకు సంబంధించి ఆర్థిక, పాలనపారమైన అనుమతులు మంజూరయ్యాయని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ భవనాలు కేవలం భౌతికంగా కనపడేటువంటి ఒక కట్టడాలు మాత్రమే కాదు.. వేలాదిమంది విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఉపయోగపడే ఆధునిక దేవాలయాలని ఆయన అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ -మిగతా 3 లో

## రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడితే
# ఊరుకోం

కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి,
బండిలపై మండిపడ్డ సిఎం రేవంత్



- మెట్రో, మూసీ నిధులపై కేంద్ర మంత్రులకు సూటి ప్రశ్నలు
- ఇతర మహానగరాల వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకోవాలి
- పరిపాలనా సౌలభ్యం కోసమే మూడు కార్పొరేషన్ల ఏర్పాటు
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవనానికి శంకుస్థాపన
- రూ.1,674 కోట్లతో మౌలిక వసతుల పనులకు శ్రీకారం
- పేదలందరికీ ఎక్కడికక్కడే లక్ష ఇళ్ల నిర్మాణం
- కేసీఆర్, మోదీ పదేళ్ల పాలనపై అసెంబ్లీ చర్చకు సవాల్

హైదరాబాద్, 8 జూన్ (మహాప్రభ)
రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటూ..గుజరాత్‌కు ఇంకెన్నాళలు గులాంగిరి చేస్తారని బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రోకి కేంద్రం నుంచి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ నిధులు ఎందుకు తీసుకురారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటున్నారని నిలదీశారు. హైదరాబాద్‌కి సింగూరు జలాలను ఎందుకు తీసుకురానివ్వరని ప్రశ్నల వర్షం కురిపించారు. గోదావరి జలాలు తీసుకొస్తే వారికేం ఇబ్బందని నిలదీశారు. గుజరాత్‌కు ఎన్నాళ్లు గులాంలుగా ఉంటారని ధ్వజమెత్తారు. సోమవారం హైదరాబాద్ మియాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. -మిగతా 3 లో



## యుద్ధం
# వెంటనే ఆపాలి

- ఇరాన్, ఇజ్రాయెల్‌కు ట్రంప్ హెచ్చరిక
- కాల్పుల విరమణకు సిద్ధం కావాలని రెండు దేశాలకు సూచన
- త్వరలోనే శాంతి ఒప్పందం కుదిరే అవకాశం
- ఉద్రిక్తతలు తగ్గకపోతే మళ్లీ సైనిక చర్యలు: ట్రంప్
- చర్చల ద్వారా పరిష్కారమే మార్గమని అమెరికా అధ్యక్షుడి పిలుపు

న్యూఢిల్లీ: 8 జూన్ (మహాప్రభ)
ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరిగాయి. పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రెండు దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్, ఇజ్రాయెల్.. రెండు దేశాలూ తక్షణమే యుద్ధం ఆపాలని, కాల్పుల విరమణ పాటించాలని కోరాడు. ఇప్పటికే శాంతి చర్చలు కొనసాగుతున్నాయని, -మిగతా 3 లో



## ఫిలిప్పీన్స్‌లో 7.8 తీవ్రతతో
# భారీ భూకంపం

- 15 మంది మృతి.. 200 మందికి పైగా గాయాలు
- సునామీ హెచ్చరికలు జారీ చేసిన అధికారులు
- రోడ్లు, భవనాలు, వంతెనలకు భారీ నష్టం
- సహాయక చర్యలు ముమ్మరం.. అప్రమత్తమైన పొరుగు దేశాలు

న్యూఢిల్లీ: 8 జూన్ (మహాప్రభ)
ఫిలిప్పీన్స్‌లో సోమవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. ఉదయం 7.37 గంటల సమయంలో 7.8 తీవ్రతతో దక్షిణ ఫిలిప్పీన్స్‌లో ఈ భారీ భూకంపం సంభవించింది. ఈ భూకంప ప్రభావంతో 15 మంది మరణించారు. 200 మందికిపైగా గాయపడ్డారు. ఫిలిప్పీన్స్‌లో భూంకపాలు రావడం సాధారణమే. అయితే, వాటి తీవ్రత చాలా తక్కువగా ఉంటుంది. కానీ, ఈసారి భూకంపం మాత్రం ఈ ఏడాదిలోనే చాలా పెద్దది. ఈ భూకంప కేంద్రం ఫిలిప్పీన్స్, నైరుతి జనలర్ -మిగతా 3 లో



# నేడు ఎపిలో భారీ వర్షాలు కురిసే ఛాన్స్

- గంటకు 40--50 కి.మీ. వేగంతో ఈదురు గాలుల అవకాశం
- పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో రెడ్ అలర్ట్
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- విద్యుత్ అంతరాయాలు, వరద ముప్పుపై అధికారుల హెచ్చరికలు

అమరావతి 8 జూన్ (మహాప్రభ)
రాష్ట్రంలో మంగళవారం అక్కడక్కడ ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సోమవారం వెల్లడించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో -మిగతా 3 లో

## ప్రభుత్వ భూములు కాజేస్తే
# ఉక్కుపాదమే

బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ
అధికారులే దందాలకు పాల్పడ్డారు



- ఇందిరమ్మ ఇళ్ల స్థల పరిశీలనలో ఈ అక్రమాలు బయటపడ్డాయి
- దీనికి కారకులపై చర్యలు తీసుకున్నాం
- అక్రమ సేల్ డీడ్లను రద్దు చేయండి
- అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

హైదరాబాద్, 8 జూన్ (మహాప్రభ)
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను కొల్లగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను అంగుళం కూడా ఆక్రమించేందుకు ప్రయత్నించినా, అలాంటి ప్రయత్నాలను ప్రోత్సహించినా చూస్తూ ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే దోచుకునే ప్రయత్నం చేయడం -మిగతా 3 లో



## రైలు ప్రయాణికులకు
# శుభవార్త..

- టికెట్ బుకింగ్‌కు ఇక నుంచి కొత్త సిస్టమ్..!
- నిమిషాల్లో లక్షల టికెట్ల బుకింగ్‌కు అవకాశం
- 1986 నాటి పాత వ్యవస్థకు పూర్తిగా వీడ్కోలు
- డిజిటల్ టికెట్ల వాటా 88 శాతానికి చేరిక
- వెయిటింగ్ లిస్ట్‌పై ఏఐ అంచనాలు.. 94% కచ్చితత్వం

న్యూఢిల్లీ: 8 జూన్ (మహాప్రభ)
భారత రైల్వే మంత్రిత్వ శాఖ ప్రయాణికులకు శుభవార్త చెప్పింది. టికెట్ బుకింగ్ విధానంలో గత కొన్ని దశాబ్దాలుగా ఎదురవుతున్న సమస్యలకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది. ఆగస్టు నుంచి సరికొత్త 'ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ ను అందుబాటులోకి తీసుకురాబోతోంది. దాదాపు 1986 నుంచి వాడుకలో ఉన్న పాత సాంకేతిక విధానాన్ని ఈ సరికొత్త వ్యవస్థతో పూర్తిగా మార్చేయనుంది. ఈ సరికొత్త అప్‌గ్రేడ్ వల్ల ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది.ఈ కొత్త బుకింగ్ విధానంలో నిమిషాల వ్యవధిలోనే లక్షలాది టికెట్లను ఎలాంటి సర్వర్ సమస్యలు లేకుండా బుక్ చేసుకోవచ్చు. ఈ కొత్త సిస్టమ్‌కు మారే ప్రక్రియపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలోని రైల్ భవన్‌లో ఉన్నతాధికారులతో కలిసి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సాంకేతిక మార్పుల -మిగతా 3 లో



## మహిళా శక్తి మహాసభకు
# సర్వం సిద్ధం

- మహిళల ఆర్థిక సాధికారతకు చారిత్రక మైలురాయి
- మహిళా శక్తి మహాసభను విజయవంతం చేయండి
- రాష్ట్ర మహిళలకు మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పిలుపు

హైదరాబాద్ 8 జూన్ (మహాప్రభ)
తెలంగాణ మహిళా సాధికారత చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ నిర్వహిస్తున్న 'మహిళా శక్తి మహాసభ'కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు -మిగతా 3 లో

## ఒమన్ తీరంలో భారతీయ నౌకపై దాడి



**న్యూఢిల్లీ 8 జూన్ (మహాప్రభ)**
ఒమన్ తీరంలో భారతీయ నౌకపై దాడి జరిగింది. హోర్ముజ్ జలసంధికి దక్షిణంగా 24మంది భారతీయ నావికులతో వెళుతున్న ఎంటి మారివెక్స్ నౌకపై దాడి జరిగిందని ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల మంత్రిత్వ శాఖ (ఎంఒపిఎస్ డబ్ల్యు) సోమవారం ధృవీకరించింది. అయితే ప్రస్తుతం సిబ్బంది అంతా సురక్షితంగా ఉన్నారని తెలిపింది. పశ్చిమాసియాలోని తాజా పరిణామాలపై జరిగిన అంతర్ మంత్రిత్వ సమావేశంలో షిప్పింగ్ విభాగం డైరెక్టర్ ఒపేష్ కుమార్ శర్మ మాట్లాడుతూ.. ఈ రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు నౌకలో అగ్ని ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం అందిందని అన్నారు. సిబ్బంది అంతా క్షేమంగా ఉన్నారని అన్నారు. సముద్రయాన సిబ్బంది భద్రతను నిర్ధారించడానికి తమ మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, విదేశాల్లోని భారత మిషన్లు, భారత నౌకాదళం, రక్షణ మంత్రిత్వ శాఖల సంప్రదిస్తున్నామని అన్నారు. నౌకపై ఆయుధం లేదా డ్రోన్ వంటివి ఢీకొట్టాయా లేదా అనేది ఇప్పుడే స్పష్టం చేయలేమని అన్నారు. ఆ నౌక హోర్ముజ్ జలసంధికి దక్షిణ దిశగా స్పష్టమైన దూరంలో ఉందని అన్నారు. దాడి జరిగిన నౌకలో ఎటువంటి సరుకు లేదని అన్నారు.

## సీఎం విజయ్‌కు చెక్ పెట్టిన ప్రజ్ఞానంద.



**చెన్నై 8 జూన్ (మహాప్రభ)**
నార్వే చెస్ టైటిల్ గెలిచిన గ్రాండ్‌మాస్టర్ ఆర్ ప్రజ్ఞానంద.. అదే ఊపులో ఉన్నారు.తమిళనాడు సీఎం విజయ్‌ని కూడా ప్రజ్ఞానంద ఓ గేమ్ లో ఓడించారు. నార్వే టైటిల్ గెలిచిన సందర్భంగా సీఎం విజయ్‌ని ఆ రాష్ట్ర సెక్రటేరియేట్‌లో ప్రజ్ఞానంద కలిశారు. ఆ సమయంలో ఇద్దరూ కాసేపు సరదాగా చెస్ ఆడారు. అయితే కేవలం కొన్ని ఎత్తుల్లోనే సీఎం విజయ్‌కు గ్రాండ్‌మాస్టర్ చెక్ పెట్టేశారు. చెస్ స్టార్ ప్రజ్ఞానందకు 50 లక్షల ప్రత్యేక నజరానా సీఎం అందజేశారు. అయితే సీఎం విజయ్ చెస్ ఆడిన తీరును ప్రజ్ఞానంద మెచ్చుకున్నారు. సీఎంతో చెస్ ఆడడం అద్భుతమైన అనుభూతిని ఇచ్చిందన్నాడు. విజయ్, ప్రజ్ఞానంద చెస్ ఆడిన విలువల్స్‌ను రిలీజ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన నగదు పురస్కారం తనలో ప్రేరణ ఇస్తోందన్నారు. సీఎం విజయ్ చెస్ ఆడుతారన్న సంగతి తనకు తెలియదని, చెస్ బోర్డు తెమ్మన్నారని, టేబుల్‌పై చెస్ ఆడామని ప్రజ్ఞానంద తెలిపారు. తన స్నేహితులతో కలిసి చెస్ ఆడేవాడినని సీఎం విజయ్ చెప్పినట్లు తెలిపారు. గేమ్ నేనే గెలిచినా, సీఎం బాగా ఆడారని అన్నాడు.

## నాలుగు రాష్ట్రాలలో ఇడి దాడులు

**న్యూఢిల్లీ 8 జూన్ (మహాప్రభ)**



: మనీలాండరింగ్ కేసులో భాగంగా నాలుగు రాష్ట్రాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం దాడులు నిర్వహించినట్లు ఇడి అధికారులు తెలిపారు. మిజోరాం -- మయన్మార్ సరిహద్దు, త్రిపుర -- బంగ్లాదేశ్ సరిహద్దు, పశ్చిమ బెంగాల్‌లోని నాలుగు ప్రాంతాల్లో ఇడి సోదాలు నిర్వహించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం 2002లోని సెక్షన్ 17 కింద ఇడికి చెందిన ఐజ్వాల్ సబ్-జోనల్ కార్యాలయం నుండి పలు బృందాలు తెల్లవారుజామున ఏకకాలంలో సోదాలు నిర్వహించాయి. కాగా, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) ఈ కేసు ఇడికి అప్పగించడం జరిగింది. ఆగస్టు 21, 2025న, బంగ్లాదేశ్ సరిహద్దుకు కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్న త్రిపురలో 40 గ్రాముల హెరాయిన్‌ను, మయన్మార్ సరిహద్దుకు 500 మీటర్ల దూరంలో ఉన్న మిజోరంలో 49.101 కిలోల మెథాంఫేటమిన్ ఎన్‌సిబి బృందం స్వాధీనం చేసుకుంది. మిజోరంలోని చంఫాయ్, జోఖావ్‌తార్ సెక్టార్ల ద్వారా మయన్మార్ నుండి మెథాంఫేటమిన్‌ను సేకరించి, త్రిపురలో దానిని స్వీకరించే వ్యక్తులకు చేరవేస్తున్న ఒక వ్యవస్థీకృత సరిహద్దు సిండికేట్‌ను దర్యాప్తులో వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. ఈ సిండికేట్ ద్వారా వచ్చిన సొమ్మును పలు బ్యాంకు ఖాతాలు, బినామీ సంస్థల ద్వారా దారి మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ సిండికేట్ ద్వారా 142 కోట్ల సొమ్మును గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

## కిమ్‌తో జిన్‌పింగ్ చర్చలు

**బీజింగ్ :8 జూన్ (మహాప్రభ)**



చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్-ఉన్‌తో చర్చలు జరిపేందుకు సోమవారం ప్యాంగ్‌యాంగ్‌కు చేరుకున్నారని చైనా జిన్హువా వార్తా సంస్థ నివేదించింది. ఇరు నేతలు ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక స్నేహాన్ని కొనసాగించడానికి, ద్వైపాక్షిక సంబంధాలను మరింత అభివృద్ధి చేసే దిశలో చర్చలు జరగనున్నాయని జిన్హువా వార్తా సంస్థ వెల్లడించింది. దాదాపు ఈ ఏడేబీజింగ్ : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్-ఉన్‌తో చర్చలు జరిపేందుకు సోమవారం ప్యాంగ్‌యాంగ్‌కు చేరుకున్నారని చైనా జిన్హువా వార్తా సంస్థ నివేదించింది. ఇరు నేతలు ఇరు దేశాల మధ్య దీర్ఘకాలిక స్నేహాన్ని కొనసాగించడానికి, ద్వైపాక్షిక సంబంధాలను మరింత అభివృద్ధి చేసే దిశలో చర్చలు జరగనున్నాయని జిన్హువా వార్తా సంస్థ వెల్లడించింది. దాదాపు ఈ ఏడేళ్లలో తొలిసారి జిన్‌పింగ్ ఉత్తరకొరియా పర్యటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 2024లో రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తరకొరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇరు నేతలు రక్షణ ఒప్పందంపై సంతకాలు చేశారు.

# మమతా బెనర్జీకి భారీ జలక్..

- ఎన్డీఏలో చేరనున్న 20 మంది టీఎంసీ ఎంపీలు !



**కోల్‌కతా 8 జూన్ (మహాప్రభ)**
టీఎంసీ నేత మమతా బెనర్జీకి భారీ జలక్ తగలనున్నది. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన సుమారు 20 మంది లోక్‌సభ ఎంపీలు ఎన్డీఏ కూటమిలో చేరే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసే ఆలోచనలో ఉన్నారు. టీఎంసీ లోక్‌సభ చీఫ్ విఫ్ కకోలీ ఘోష్ ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం వెల్లడైంది. 20 టీఎంసీ ఎంపీలు ఎన్డీఏలో చేరనున్న విషయాన్ని ఆమె కన్ఫర్మ్ చేశారు. తనతో పాటు మొత్తం 20 మంది ఎంపీలు.. స్పీకర్‌ను కలిసి ఎన్డీఏలో చేరే అంశంపై తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయనున్నట్లు ఆమె చెప్పారు. ఎంపీల మధ్య జరిగిన విస్తృత స్థాయి చర్చ తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పారు.ప్రస్తుతానికి లోక్‌సభ టీఎంసీ చీఫ్ విప్‌గా తానే కొనసాగుతున్నట్లు కోలీ ఘోష్ తెలిపారు. ఆ హోదాలోనే మిగితా ఎంపీలతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజలు ఇచ్చిన తీర్పును ఎంపీలు ఆమోదించారని, ఇక భవిష్యత్తు రాజకీయం ఎన్డీఏతో ఉండబోనున్నట్లు ఆమె చెప్పారు. ఇటీవల రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ కలిసిన తరహాలోనే .. లోక్‌సభలో ఎన్డీఏ కూటమిలో టీఎంసీ ఎంపీలు చేరుతారని ఊహాగానాలు వినిస్తున్నాయి. లోక్‌సభలో ప్రస్తుతం 28 మంది టీఎంసీ ఎంపీలు ఉన్నారు. ఒకవేళ ఎన్డీఏలో ఆ పార్టీ చేరాలంటే, రెండో వంతు మెజారిటీ కింద 19 మంది ఎంపీలు చేరితే అప్పుడే పార్టీ ఫిరాయింపు చట్టం వర్తించదు. ఇక రాజ్యసభలో కూడా టీఎంసీ చీలిపోయే అవకాశం ఉన్నది. రాజ్యసభలో మొత్తం 13 మంది టీఎంసీ ఎంపీలు ఉన్నారు. అయితే దీంట్లో 9 మంది ఎన్డీఏలో చేరిన టీఎంసీ ఆనవాళ్లు మాయమైనట్లే అవుతుంది. టీఎంసీ రాజ్యసభ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ ఇప్పటికే రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

# ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు మళ్లీ తీవ్ర స్థాయికి..

**దేశ పౌరులకు భారత ప్రభుత్వం ఫ్రెష్ అడ్వయిజరీ**



**న్యూఢిల్లీ 8 జూన్ (మహాప్రభ)**
పశ్చిమాసియా లో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. దాంతో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని, ఇప్పటికే అక్కడ ఉన్నవారు వెంటనే దేశం విడిచి వచ్చేయాలని భారత పౌరులను మరోసారి హెచ్చరించింది. ఈ మేరకు టెహ్రాన్ (ఎవష్ట్రీభుఅ) లోని భారత రాయబార కార్యాలయ ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. 'ఇక్కడి తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్‌కు ఎలాంటి ప్రయాణాలు చేయవద్దు. ప్రస్తుతం ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు కూడా అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా స్వదేశానికి వెళ్లిపోవాలి' అని ఎంబసీ తన ప్రకటనలో స్పష్టంచేసింది.ఇటీవల ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య దాడులు, ప్రతిదాడులు పెరిగాయి. ఇరాన్‌లోని మహ్‌షహర్ ప్రాంతంలో ఉన్న పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌పై దాడి చేసినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించింది. సోమవారం ఉదయం ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రయోగించిన క్షిపణులన్నింటినీ విజయవంతంగా అడ్డుకున్నామని తెలిపింది. ఈ దాడుల నేపథ్యంలోనే భారత్ ఈ ట్రావెల్ అడ్వైజరీని జారీచేసింది. ఇజ్రాయెల్ గనక దక్షిణ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ఇజ్రాయెల్, దాని మద్దతుదారులపై వినాశకరమైన దాడులు తప్పవని ఇరాన్ కమాండర్ అలీ అబ్దుల్లాహీ హెచ్చరించారు. అమెరికా పచ్చజెండా ఊపడంతోనే ఇజ్రాయెల్ ఫాస్ఫరస్ బాంబుల వంటి నిషేధిత ఆయుధాలను వాడుతూ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని అలీ అబ్దుల్లాహీ ఆరోపించారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ, ఇతర సైనిక ఉన్నతాధికారులు మరణించడంతో ఈ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్ పలుచోట్ల డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసింది. ఏప్రిల్ 8న కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినప్పటికీ, ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే శాంతి స్థాపన కోసం ఇరాన్, అమెరికా మధ్య చర్చలు జరుగుతున్నట్లు కూడా నివేదికలు వస్తున్నాయి.

# 'జూలైలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం'

**కేంద్రమంత్రి పీయూష్ గోయెల్**



**న్యూఢిల్లీ 8 జూన్ (మహాప్రభ)**
సుదీర్ఘకాలంగా చర్చల దశలో ఉన్న భారత్-అమెరికా ప్రతిష్ఠాత్మక వాణిజ్య ఒప్పందం తుదిదశకు చేరుకుంది. వచ్చే జూలైలో ఈ ఒప్పందానికి సంబంధించిన మొదటి విడత ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. ఇటీవలి కాలంలో పన్నుల విషయంలో ఇరుదేశాల మధ్య స్వల్ప వివాదం తలెత్తినప్పటికీ చర్చలు మాత్రం వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించుకుంటూ.. పరస్పర మార్కెట్ భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవడమే ఈ ద్వైపాక్షిక ఒప్పందం ముఖ్య ఉద్దేశమని గోయల్ అభిప్రాయపడ్డారు.దీనివల్ల భారతీయ ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్‌లో భారీ ప్రయోజనం చేకూరనుంది. గత కొన్ని వారాలుగా ఇరుదేశాల ఉన్నతాధికారుల మధ్య చర్చలు ఊపందుకున్నాయని, అందరూ ఊహించిన దానికంటే ముందే ఒక మంచి నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు జూన్ 5న ఢిల్లీలో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో అమెరికా వాణిజ్య విభాగానికి చెందిన పూర్తిస్థాయి బృందం పాల్గొందని గోయల్ గుర్తుచేశారు. ఆ భేటీలోనే ఒప్పందానికి అడ్డంకిగా ఉన్న చాలా అంశాలపై ఒక స్పష్టత వచ్చిందన్నారు. జూలై మధ్య నాటికి ఇరుదేశాల ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసేలా మొదటి విడత ఒప్పందాన్ని అమలుచేసే స్థితికి చేరుకుంటామని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. నిజానికి ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఈ వాణిజ్య ఒప్పందంపై ఇరుదేశాల మధ్య ఒక ప్రాథమిక అవగాహన కుదిరింది. కానీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన కొన్ని పన్నుల నిర్ణయాలపై చట్టపరమైన సవాళ్లు ఎదురుకావడంతో చర్చలు కాస్త నెమ్మదించాయి. ఇటీవల ఢిల్లీలో జరిగిన అధికారుల భేటీ తర్వాతే మళ్లీ ఈ ప్రక్రియ వేగం పుంజుకుంది. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నప్పటికీ కొన్ని సవాళ్లు ఇంకా ఎదురవుతూనే ఉన్నాయి. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై అదనంగా 12.5 శాతం పన్ను విధించాలని అమెరికా గత వారమే ఓ ప్రతిపాదన తెచ్చింది. నిర్బంధ శ్రమ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతులను అడ్డుకోవడంలో భారత్ తగిన చర్యలు తీసుకోలేదనే నెపంతో ఈ ప్రతిపాదన చేశారు. అయినప్పటికీ వాణిజ్య బంధాన్ని దెబ్బతీసుకోవద్దనే ఉద్దేశంతో ఇరుదేశాలు చర్చలను నిరంతరం కొనసాగిస్తున్నాయి. అమెరికా ప్రస్తుతం భారతదేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వాములలో ఒకటిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థలను సురక్షితం చేసుకోవడానికి దేశాలు ప్రయత్నిస్తున్న తరుణంలో ఈ ఒప్పందం భారత్‌కు ఎంతో కీలకం కానుంది. మంత్రి పీయూష్ గోయల్ చెప్పిన టైమ్‌లైన్ ప్రకారం అన్నీ సజావుగా సాగితే జూలై మధ్యకల్లా ఇరుదేశాల మధ్య సరికొత్త ఆర్థిక అధ్యాయం మొదలవుతుంది.

# యూపీలో ఎన్‌కౌంటర్..

-కరుడుగట్టిన క్రిమినల్ బబ్లూ హతం..
- ఇద్దరు పోలీసులకు గాయాలు



**న్యూఢిల్లీ 8 జూన్ (మహాప్రభ)**
ఉత్తరప్రదేశ్‌లో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో కరుడుగట్టిన క్రిమినల్ హతమయ్యాడు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. అయోధ్యలో సోమవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో భాను ప్రతాప్ సింగ్ అలియాస్ బబ్లూ హతమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర ప్రదేశ్ పోలీసులు, స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్) సిబ్బంది కలిసి ఆపరేషన్ నిర్వహించారు. హతుడు భాను ప్రతాప్ సింగ్‌పై అనేక జిల్లాల్లో 40 వరకు కేసులున్నాయి.అతడిపై అనేక చోట్లా రూ2 లక్షల వరకు రివార్డ్ కూడా ఉంది. గోరక్‌పూర్ పరిధిలోని బిక్నిపూర్ గ్రామానికి చెందిన బబ్లూ అనేక నేరాలకు పాల్పడ్డాడు. అతడిపై యూపీలోని అనేక జిల్లాల్లో చాలా కేసులు నమోదయ్యాయి. కొంతకాలంగా అతడు పరారీలో ఉన్నాడు. అతడి గురించి ఇటీవల ఎస్టీఎఫ్ అధికారులకు సమాచారం అందింది. దీంతో యూపీ పోలీసులతో కలిసి బబ్లూ ఉన్న ప్రదేశాన్ని చుట్టుముట్టారు. ఇది గమనించిన బబ్లూ పోలీసులపై కాల్పులు జరిపాడు. ఈ క్రమంలో పోలీసులు కూడా అతడిపై ఎదురు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో భాను ప్రతాప్ సింగ్ అలియాస్ బబ్లూకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని పోలీసులు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతడు చికిత్స పొందుతూ మరణించాడు. ఇద్దరు పోలీసులకు కూడా గాయాలయ్యాయి. వారికి కూడా అధికారులు చికిత్స అందిస్తున్నారు. యూపీలోని ఘాజీపూర్‌లో కూడా మరో ఎన్‌కౌంటర్ జరిగింది. ఇటీవల ఒక వ్యాపారిని ఒక వ్యక్తి కాల్చి చంపాడు. అతడిని పట్టుకునే క్రమంలో పోలీసులపై కాల్పులు జరిపి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరపడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే పోలీసులు ఆస్పత్రికి తరించేలోపే అతడు మరణించినట్లు వైద్యులు తెలిపారు.

పెళ్లికి ముందు ఇద్దరు మేజర్ల ఇష్టపూర్వక

# శారీరక బంధాన్ని తప్పుపట్టలేం

మొదటి తరువాయి

ఓ మహిళతో శారీరక సంబంధం పెట్టుకుని మోసం చేశాడనే కారణంతో తెలంగాణ ప్రభుత్వం అతని ఉద్యోగాన్ని రద్దుచేసింది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ 2014లో తిరుపతిపై ఓ యువతి క్రిమినల్ కేసు పెట్టింది. ఆ తర్వాత 2015లో లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు రాజీకొచ్చాయి. ఈ పాత కేసును కారణం చూపిస్తూ తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అతని ఉద్యోగాన్ని రద్దుచేసింది. దీనిపై సదరు అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం.. పోలీసు బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టింది. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో పెళ్లికి ముందే ప్రేమించుకోవడం, శారీరక సంబంధాలు కలిగి ఉండటం సాధారణంగా మారిందని కోర్టు వ్యాఖ్యానించింది. ఇష్టపూర్వకంగా కలిసి ఉన్నంత మాత్రాన వారు పెళ్లి చేసుకోలేదనే ఒకే ఒక్క కారణంతో ఒకరు మరొకరిని మోసం చేశారని అనుకోలేమని స్పష్టంచేసింది. ప్రతి ప్రేమకథా పెళ్లితోనే ముగియాలని నియమం ఏమీలేదని ధర్మాసనం పేర్కొన్నది. లోక్ అదాలత్‌లో కేసు రాజీపడినంత మాత్రాన అభ్యర్థి తన తప్పును ఒప్పుకున్నట్లు కాదని న్యాయమూర్తులు స్పష్టంచేశారు. బాధితురాలే స్వయంగా కేసును వెనక్కి తీసుకుని రాజీపడినప్పుడు.. సదరు అభ్యర్థి క్యారెక్టర్ బాలేదంటూ ఉద్యోగానికి అనర్హుడిని చేయడానికి పోలీస్‌బోర్డుకు ఎలాంటి హక్కు లేదని తేల్చిచెప్పింది. కేవలం విఫలమైన ప్రేమబంధాన్ని సాకుగా చూపి ఉద్యోగం నిరాకరించడం పూర్తిగా అన్యాయమని కోర్టు పేర్కొన్నది. చివరికి సుప్రీంకోర్టు తెలంగాణ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇచ్చిన రద్దు ఉత్తర్వులను పూర్తిగా కొట్టివేసింది. సదరు అభ్యర్థిని వెంటనే విధుల్లోకి తీసుకుని, తదుపరి బ్యాచ్ కానిస్టేబుళ్లతోపాటు శిక్షణకు పంపాలని ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పునరుద్ధరించింది.

అణ్వస్త్రాల సంఖ్య పెంచుకుంటున్న

# ఇండియా, పాక్

మొదటి తరువాయి

ఇన్‌స్టట్యూట్(ఎస్ఐపీఆర్ఐ) తన నివేదికలో పేర్కొన్నది. భారత్, చైనా దేశాలు తమ వద్ద ఉన్న అణ్వస్త్రాల సంఖ్యను పెంచుకున్నట్లు ఆ నివేదికలో చెప్పారు. దీంతో పాటు వార్‌హెడ్స్ ఉన్న అణ్వాయుధాలను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించినట్లు తెలుస్తోంది. జనవరి 2026 నాటికి భారత్ వద్ద సుమారు 190 న్యూక్లియర్ వెపన్స్ ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే సంఖ్య స్వల్పంగా పెరిగింది. ఇక చైనా వద్ద నిల్వల్లో 620 వార్‌హెడ్స్ ఉన్నాయి. గత ఏడాది ఆ దేశం వద్ద 600 మాత్రమే ఉండే అని స్టాక్‌హోమ్ రీసర్చ్ సంస్థ తెలిపింది. భారత్ తన యుద్ధ విమానాలు, నేల నుంచి ప్రయోగించే మిస్సైళ్లు, అణ్వాయుధ సామర్థ్యం కలిగిన జలాంతర్గామిలకు న్యూక్లియర్ వెపన్స్‌ను అమర్చినట్లు కూడా ఆ రిపోర్టులో పేర్కొన్నారు. ఇంకా అదనపు మిస్సైళ్ల కోసం మరికొన్ని వార్‌హెడ్స్‌ను కూడా తయారు చేస్తున్నట్లు సిప్రి తన రిపోర్టులో చెప్పింది. ఆ వార్‌హెడ్స్ ఉన్న క్షిపణులను కంటేనర్లకు తరలిస్తున్నట్లు కూడా రిపోర్టులో చెప్పారు. స్టాక్‌హోమ్ సంస్థ అంచనాల ప్రకారం.. 2026 జనవరి నాటికే స్వల్ప సంఖ్యలో ఉన్న వార్‌హెడ్స్‌ను ఇండియా తన జలాంతర్గాములకు తరలించినట్లు తెలుస్తోంది. చైనాపై ఫోకస్‌తో ఇండియాన తన లాంగ్ రేంజ్ వెపన్ సిస్టమ్‌లను తయారు చేసుకుంటున్నట్లు రిపోర్టులో తెలిపారు. దీంతో పాటు పాకిస్థాన్‌తో ఉన్న శత్రుత్వాన్ని దృష్టిలో పెట్టుకుని కూడా ఇండియా తన ప్లానింగ్ చేస్తున్నట్లు సిప్రి నివేదికలో చెప్పారు. ఇక పాకిస్థాన్ అణ్వాయుధాల రిపోర్టును సిప్రి ప్రజెంట్ చేసింది. అయితే జనవరి 2026 నాటికి పాకిస్థాన్ తన న్యూక్లియర్ నిల్వలను స్థిరంగా ఉంచినట్లు పేర్కొన్నది. ఆ దేశం వద్ద 170 వార్‌హెడ్స్ ఉన్నట్లు రిపోర్టులో వెల్లడించారు. ల్యాండ్, ఎయిర్ సామర్థ్యంలో బాగానే ఉన్నా.. సముద్ర సామర్థ్యాన్ని పాక్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నది. అయితే రాబోయే దశాబ్దంలో తన అణ్వస్త్ర సామర్థ్యాన్ని పాక్ పెంచుకోనున్నదని రిపోర్టులో పేర్కొన్నారు. జనవరి 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా 12,187 అణ్వాయుధాలు ఉన్నట్లు స్టాక్‌హోమ్ సంస్థ తెలిపింది. మిలిటరీ వద్ద 9745 ఆయుధాలు ఉన్నాయని ఆ రిపోర్టులో చెప్పారు. ఇక 4012 మాత్రం క్షిపణులు, ఎయిర్‌క్రాఫ్ట్ లో నిక్షిప్తం చేశారు. రష్యా, అమెరికా దేశాలు సుమారు 2200 ఆయుధాలను హై అలర్ట్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. భారత్, చైనా దేశాలు కూడా హై ఆపరేషనల్ అలర్ట్‌లో వార్‌హెడ్స్‌ను పెట్టినట్లు తెలుస్తోంది. చైనా, ఫ్రాన్స్, రష్యా, యూకే, యూఎస్ దేశాల వద్ద ఎంఐఆర్వీ టెక్నాలజీ ఆయుధాలు ఉన్నాయి. ఇక ఇండియా, పాక్, ఉత్తర కొరియా ఆ టెక్నాలజీ కోసం ప్రయత్నిస్తున్నాయి. ఎంఐఆర్వీ టెక్నాలజీ అత్యంత శక్తివంతమైందని భావిస్తున్నారు. ఇండియా కూడా ఇటీవల అగ్ని-5 మధ్యంతర క్షిపణి ద్వారా ఎంఐఆర్వీ టెక్నాలజీని పరీక్షించింది. మరోవైపు పాక్ మీడియం రేంజ్ క్షిపణులను డెవలప్ చేస్తున్నది.

# యుద్ధం వెంటనే ఆపాలి

మొదటి తరువాయి

ఇవి ముగిసిపోయే అవకాశం ఉందని, అతిత్వరలోనే ఒప్పందం కుదురుతుందని భావిస్తున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ ద్వారా వెల్లడించారు. ఇరాన్, ఇజ్రాయెల్ దాడులు చేసుకోవడం ఆపి, చర్చలకు సిద్ధం కావాలని ట్రంప్ సూచించాడు. ప్రస్తుతం ఉద్రిక్తతలు తగ్గించడానికి తాను ప్రయత్నిస్తున్నానని, అయితే, ఉద్రిక్తతలు తగ్గకపోతే మళ్లీ సైనిక చర్య తప్పకపోవచ్చని ట్రంప్ అన్నారు. మరోవైపు ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులు చేసిన నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సూచించినట్లు ట్రంప్ చెప్పారు. చర్చలు సజావుగా సాగడానికి, శాంతి ఒప్పందం కుదరడానికి నెతన్యాహును ఒప్పించినట్లు ట్రంప్ వెల్లడించారు. చర్చలు తుది దశలో ఉన్నాయని, బుధవారం లోపు శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ట్రంప్ తెలిపారు. ఇరాన్ జరిపిన మిస్సైల్ దాడుల వల్లే మళ్లీ ఉద్రిక్త పరిస్తితులు తలెత్తాయని, దీంతో ఇజ్రాయెల్ ప్రతిదాడులకు దిగిందని ట్రంప్ వెల్లడించారు. మరోవైపు ఇరాన్ మళ్లీ చర్చలకు రావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో లెబనాన్‌లోని బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులను కూడా ట్రంప్ ఖండించారు. లెబనాన్‌పై సైనిక చర్యలు ఆపేయాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు సూచించానని ట్రంప్ తెలిపారు. దీనికి ఇజ్రాయెల్ వెంటనే అంగీకరించిందన్నారు.

# ఫిలిప్పీన్స్‌లో 7.8 తీవ్రతతో భారీ భూకంపం

మొదటి తరువాయి

శాంటోస్ నగరానికి దక్షిణాన ఉన్న మిండానో ప్రాంతంలో కేంద్రీకృతమైందని అంతర్జాతీయ మీడియా తెలిపింది. భూకంప ప్రభావంతో సునామీకి కూడా అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భూకంపం తీవ్రతతో చాలా బిల్డింగులు, రోడ్లు, బ్రిడ్జిలు ధ్వంసమయ్యాయి. కొన్ని స్వల్పంగా ధ్వంసమైతే, ఇంకొన్ని పూర్తిగా ధ్వంసమయ్యాయి. రవాణా, జనజీవనం స్తంభించింది. ఫిలిప్పీన్స్‌తోపాటు ఇండోనేసియా, మలేసియాకు కూడా సునామీ హెచ్చరికలు జారీ అయ్యాయి. ఆయా దేశాల్లోని తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు వెళ్లాల్సిందిగా ప్రభుత్వాలు సూచించాయి. కూలిన శిథిలాల కింద ఎంతమంది ఉన్నారు అనే విషయంపై ఇంకా అధికారుల నుంచి ఎలాంటిస్పష్టతా లేదు. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. జనరల్ శాంటోస్ నగరంలోని ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును తాత్కాలికంగా మూసివేశారు. దీంతో పలు విమానాలు రద్దయ్యాయి. భూకంపం కారణంగా జనరల్ శాంటోస్ నగరంలో స్కూళ్లలోని విద్యార్థుల్ని ఉన్నట్లుండి తరలిస్తున్న క్రమంలో పలువురు విద్యార్థులు గాయపడ్డారు. అనేక ప్రాంతాలకు సునామీ హెచ్చరికల నేపథ్యంలో అక్కడి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సుల్తాన్ కుదారత్, సారంగాణివంటి ప్రాంతాల్లో మానిటరింగ్ సెంటర్లలో సునామీ పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# రైలు ప్రయాణికులకు శుభవార్త..

మొదటి తరువాయి

సమయంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగరాదని అధికారులను ఆదేశించారు. రైల్వే శాఖ 2002 సంవత్సరంలో ఇంటర్నెట్ ఆధారిత టికెట్ బుకింగ్‌ను ప్రారంభించింది. అప్పటి నుంచి కౌంటర్ల కంటే ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేవారి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. ప్రస్తుతం దేశంలో అమ్ముడవుతున్న మొత్తం రైల్వే టికెట్లలో దాదాపు 88 శాతం బుకింగ్స్ కేవలం డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే జరుగుతున్నాయి. ఈ భారీ డిమాండ్‌కు అనుగుణంగానే పాత వ్యవస్థను అధునాతన సాంకేతికతతో రైల్వే మారుస్తోంది. రైల్వే శాఖ డిజిటల్ విప్లవంలో భాగంగా గత ఏడాది జూలైలో ప్రారంభించిన 'రైల్ వన్' యాప్ సరికొత్త రికార్డు సృష్టించింది. కేవలం ఏడాదిలోపే ఈ యాప్ 3.5 కోట్ల డౌన్‌లోడ్లను దాటేసింది. ఈ ఒక్క యాప్ ద్వారానే టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, రైలు లైవ్ స్టేటస్, ప్లాట్‌ఫామ్ సమాచారం, ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రస్తుతం ఈ యాప్ ద్వారా రోజూ సుమారు 9.29 లక్షల టికెట్లు బుక్ అవుతున్నాయని రైల్వే శాఖ వెల్లడించింది. కొత్త సిస్టమ్‌తోపాటు ఈ ఏడాది ప్రవేశపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత వెయిటింగ్ లిస్ట్ టూల్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతోంది. మనం బుక్ చేసుకున్న వెయిటింగ్ లిస్ట్ టికెట్ కన్ఫర్మ్ అవుతుందా లేదా..? అనే అవకాశాలను ఈ టూల్ ముందుగానే అంచనా వేస్తుంది. దీని అంచనా కచ్చితత్వం గతంలో 53 శాతంగా ఉండగా.. ఇప్పుడు ఏకంగా 94 శాతానికి పెరిగింది. దీనివల్ల ప్రయాణికులు తమ ప్రయాణ ప్లాన్లను మరింత సులభంగా మార్చుకోవచ్చు.

# రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడితే ఊరుకోం

మొదటి తరువాయి

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.1,674 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. ప్రభుత్వానికి అండగా ఉంటామని మహిళలు చెబుతున్నారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్యాన్ని నియంత్రించకపోవడం వల్లే ఢిల్లీని పడావ్ పెట్టారని విమర్శించారు. ముంబైలో ట్రాఫిక్ జామ్, వర్షం వస్తే రోడ్లపైకే నీళ్లు వస్తాయని తెలిపారు. స్లమ్స్‌లో సదుపాయాలు లేక ముంబైలో నివసించే పరిస్థితి లేదని చెప్పారు. బెంగళూరులో ట్రాఫిక్ సమస్యతో హైదరాబాద్‌కు కంపెనీలు వచ్చాయని ప్రస్తావించారు. ఎయిర్‌పోర్టుకు ఎన్నిగంటల్లో చేరుకుంటామో కూడా చెప్పలేమని అన్నారు. గతేడాది వారంపాటు నీళ్లలోనే చెన్నై ఉందని వివరించారు. కోల్‌కతా శాంతిభద్రతల గురించి చెప్పాల్సిన అవసరమే లేదని తెలిపారు. ఐదు నగరాల నుంచి మనం పాఠాలు నేర్చుకోవాలని అన్నారు. ఒక్కటే నగరంగా ఉంటే అనేక సమస్యలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. పరిపాలనలో సమస్యలు తలెత్తకుండా 3 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని వివరించారు. అమెరికా సిలికాన్ వ్యాలీతో మన సైబరాబాద్ పోటీపడుతోందని ఉద్ఘాటించారు. గ్రేటర్ చుట్టూ నలుగురు బీజేపీ ఎంపీలు ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తెలంగాణలో 8 మంది ఎంపీలను ప్రజలు గెలిపించారని తెలిపారు. మెట్రో, మూసీ ప్రక్షాళనకు అనుమతులు ఎందుకు తేవట్లేదని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి ఎంత లడాయి మనిషి అనేది అందరికీ తెలుసునని విమర్శించారు. కిషన్‌రెడ్డి డ్రామాలు ఆపాలని ఎద్దేవా చేశారు. తెలంగాణతో మహారాష్ట్ర సీఎం చర్చలకు రాకుండా.. అడ్డుకుంటున్నది బీజేపీనేనని ఆగ్రహించారు. సబర్మతి అద్భుతమన్న బీజేపీ నేతలు.. మూసీ ప్రక్షాళన చేయరా అని ప్రశ్నించారు. పదేళ్ల తర్వాత ఒకాయన ఫామ్‌హౌస్‌కు వెళ్లారని విమర్శించారు. పదేళ్లపాటు కేసీఆర్, 12 ఏళ్లలో మోదీ ఏం చేశారో అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్, బీజేపీ నేతలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎకరం రూ.200 కోట్లు పలుకుతున్న ప్రాంతంలో మౌలిక వసతులు అవసరమని చెప్పుకొచ్చారు. కార్పొరేట్ ఆఫీస్‌ల మాదిరిగానే కార్పొరేషన్ ఆఫీస్ నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో లక్ష ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ఎక్కడ నివసించేవారికి అక్కడే ఇళ్లు కట్టి ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.1,674.74కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. మియాపూర్‌లో రూ.161కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. రూ.530కోట్లతో మియాపూర్ చౌరస్తాలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ.308కోట్లతో శేరిలింగంపల్లి ఆర్వోబీ నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టారు. రూ.65.53కోట్లతో నిర్మించిన బాచుపల్లి ఫ్లైవర్‌కు సీఎం రేవంత్ ప్రారంభోత్సవం చేశారు.

# తెలంగాణలో 'నాలెడ్జ్' విప్లవం

మొదటి తరువాయి

యువకుల కోచింగ్ కష్టాలను శాశ్వతంగా దూరం చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ బలమైన సంకల్పమని ఆయన స్పష్టం చేశారు.

ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించ తలపెట్టిన 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్' స్థలాన్ని, ఆ తర్వాత కాచిగూడలోని 'నింబోలిఅడ్డా హాస్టల్' ప్రాంగణాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఉప ముఖ్యమంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ ను ట్యాంక్‌బండ్ దగ్గర సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, మరో 10 అంతస్తులతో నిర్మించనున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. అవతేకాక నింబోలిఅడ్డా వద్ద మూడు అంతస్తులతో హాస్టల్ భవనాల నిర్మాణం దళిత, నిరుపేద వర్గాల చిరకాల వాంఛ అని చెప్పారు. ఈ భవనాలను నిర్మించడం ద్వారా రాష్ట్రంలో జ్ఞానం పొందాలనుకునే అందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడతాయని చెప్పారు. ఈ భవనాల నిర్మాణంకు సంబంధించి ప్రతిపాదనలు పంపిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తరఫున్గ÷నాన్స్ క్లియరెన్స్ చేసి పంపించడం జరిగిందన్నారు. నాలెడ్జ్ సెంటర్ లో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, కాన్ఫరెన్స్ హాల్స్ లో విజ్ఞానాన్ని పంచే అత్యుత్తమ వేదికలగా నిలుస్తాయనే అశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇక్కడ నిర్వహించే కార్యకలాపాలను డిజిటల్ వ్యవస్థతో మారుమూల ప్రాంతాలకు చేర్చేలా బలమైన సాంకేతిక వ్యవస్థను అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తరువాత మేము చాలా స్పష్టంగా చెప్పాము.. రాష్ట్రంలోని ప్రతి శాసనసభ నియోజకవర్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్స్ ను నిర్మిస్తున్నట్లు ప్రకటించామని చెప్పారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కోచింగ్ కోసం హైదరాబాద్ రాకుండా అక్కడే ప్రిపేరయ్యేలా ఇవి ఉండబోతున్నాయి. భవిష్యత్తులో ఆయా శాసనసభ నియోజకవర్గాల్లోనే, అక్కడే వాళ్లకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేస్తాం. బెస్ట్ ఆఫ్ ది బెస్ట్ లెక్చరర్స్ ఇక్కడి నుంచి పాఠాలు చెబుతుంటే.. ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులు ఉన్నచోటనుంచే కదలకుండా కోచింగ్‌ను పొందేలా ఈ సెంటర్లను ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు చెప్పారు. నాలెడ్జ్ సెంటర్ కేవలం ఒక భవనం మాత్రమే కాదని, కోట్లాది మంది విజ్ఞానాన్ని పెంపొందించుకునే ఒక నిరంతర విద్యా వేదికగా ఆయన అభివర్ణించారు. కూలీ నాలీ చేసుకునే తల్లిదండ్రులు, వ్యవసాయం చేసుకునే కుటుంబాలు, మధ్యతరగతి చిన్న వ్యాపారుల పిల్లలు.. పోటీ పరీక్షల కోచింగ్ కోసం హైదరాబాద్ వచ్చి ఇక్కడ వసతి ఖర్చుల భారాన్ని మోయలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం ముందుచూపుతో ఈ నిర్ణయం తీసుకుందన్నారు. కేవలం ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వడమే కాకుండా, నిరుద్యోగులు ఆయా ఉద్యోగాలను సాధించేలా రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని ఈ నాలెడ్జ్ సెంటర్ ద్వారా అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఈ ప్రధాన సెంటర్ నుంచి బెస్ట్ లెక్చరర్స్ చెప్పే పాఠాలను.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల్లో నిర్మించబోయే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో, డిజిటల్ వ్యవస్థ ద్వారా విద్యార్థులు నేరుగా వీక్షించేలా ఇంటర్‌లింక్ చేస్తున్నట్లు వివరించారు. ట్యాంక్‌బండ్ వద్ద నిర్మించే ఈ భవన సముదాయంలో స్టడీ సర్కిల్స్, డిజిటల్ లైబ్రరీ, అత్యాధునిక కాన్ఫరెన్స్ హాళ్లు ఉంటాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులతో ఇక్కడ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాత నిర్మాణాన్ని పూర్తిగా తొలగించడం కోసం రూ.5 కోట్ల నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం 2016లోనే దీనికి శంకుస్థాపన చేసినప్పటికీ వివిధ కారణాల వల్ల నిర్మించలేకపోయిందన్నారు. మా ప్రజాప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో ఈ భవనాన్ని త్వరితగతిన పూర్తి చేయడానికి సంకల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం రూ.110 కోట్లని, ఈ ఏడాదే పనులు వేగంగా జరగడానికి బ్జడెట్ లోనే రూ.50 కోట్లను కేటాయించినట్లు

డిప్యూటీ సీఎం ప్రకటించారు.

# నేడు ఎపిలో భారీ వర్షాలు కురిసే ఛాన్స్

మొదటి తరువాయి

అప్రమత్తంగా ఉండాలని ప్రజలను విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాల సూచన ఉందని తెలిపింది. ఇక కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో పాటు వర్షాలు పడతాయని తెలిపింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వైఎస్సార్ కడప జిల్లాలో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది.

అల్లూరి సీతారామరాజు, మార్కాపురం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాల కురుస్తాయని సూచించింది. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడ వద్దని ప్రజలకు స్పష్టం చేసింది. అలాగే భారీ హోర్డింగ్స్ ప్రాంతాల్లో ఉండ వద్దని ప్రజలకు తెలిపింది. ల్గ÷తులు, పశువుల కాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉరుములు వినిపించగానే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని స్పష్టం చేసింది. తెగిపోయిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. ఉత్తరాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో 42 - 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎండ తీవ్రత కొనసాగనుందని తెలిపింది. పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 40 - 42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నెలకొంటాయని చెప్పింది. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కూడా ఎండ తీవ్రత కొనసాగనుందని విపత్తు నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది. అయితే సోమవారం ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని గూడూరులో 41.7 డిగ్రీలు, చిట్యాలలో 41.4 డిగ్రీలు, ఎస్. రాయవరంలో 41.2 డిగ్రీలు, పెదపారుపూడిలో 41 డిగ్రీల గరిష్ఠ

ఉష్ణోగ్రత నమోదు అయిందని విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది.

# ప్రభుత్వ భూములు కాజేస్తే ఉక్కుపాదమే

మొదటి తరువాయి

దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాము నాయక్ 2013 నుంచి 2018 వరకు డిప్యూటేషన్పై హౌసింగ్ బోర్డులో ల్యాండ్ అక్విజిషన్ ఆఫీసర్‌గా పని చేసి అక్రమాలకు పాల్పడ్డారు. హైదరాబాద్, కూకట్‌పల్లి పరిధిలో హౌసింగ్ బోర్డు భూములను పరిశీలిస్తున్న సమయంలో ఆయన భూలీలలు బయటకు వచ్చాయి. హైకోర్టు 5-6 గేట్ల మధ్య ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డుకు చెందిన స్థలాన్ని రామునాయక్ 2018, ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్టు బయటపడింది. హౌసింగ్ బోర్డులో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఉద్యోగం పోగొట్టుకున్న ఇఫ్తార్ అహ్మద్ భార్య సుబియా సుల్తానా పేరిట ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఆ డబ్బులు నేటి వరకూ బోర్డుకు జమ కాలేదు. అప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన చార్మినార్ సబ్ రిజిస్ట్రార్ పై కూడా విచారణకు ఆదేశించాం అని మంత్రి తెలిపారు.

2017 నుంచే కేసులు.. రామునాయక్ భూ దందాలకు సంబంధించి 2017 నుంచి పలు కేసులు ఉన్నాయన్నారు. అప్పట్లో బీఆర్ఎస్ పాలకులు, అధికారులు స్పందించలేదని మంత్రి చెప్పారు. విజయవాడ కాలనీలో 400 చదరపు గజాలు, తుల్జా గూడలో 22 చదరపు గజాలు, లక్ష్మీగూడలో 130 చదరపు గజాలు, మహబూబ్ గంజ్‌లో 497 చదరపు గజాల స్థలాలను రామునాయక్ పలువురి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించగా వాటిపై విచారణ చేస్తున్నామన్నారు. రామునాయక్‌ను తక్షణమే సస్పెండ్ చేశామని, విచారణ పూర్తి చేసిన తర్వాత శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రకటించారు. ఈ అక్రమాలకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద ను విధుల నుంచి శాశ్వతంగా తొలగించామన్నారు. మరో సూపరింటెండెంట్ బోనా నాయక్‌ను సస్పెండ్ చేసినట్టు వెల్లడించారు.

ఏ హోదాలో ఉన్నా వదిలిపెట్టం..

ప్రభుత్వ భూములపై కన్నేసిన వారెవరినీ వదిలిపెట్టామన్నారు. ఎంతటి హోదాలో ఉన్నా చట్టం ముందు అందరూ సమానమే తేల్చి చెప్పారు. ప్రభుత్వ భూములను కొల్లగొట్టే అధికారులకు ప్రభుత్వ సేవలో కొనసాగే అర్హత లేదన్నారు. ఇలాంటి వారిని గుర్తించి శాశ్వతంగా తొలగించే దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రజల ఆస్తులను కాపాడటం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు.

# మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

మొదటి తరువాయి

25 వేల మంది మహిళలు హాజరుకానున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధి, నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఈ మహాసభ ప్రతీకగా నిలవనుంది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఆయన సభలో వివరించనున్నారు. అదే వేదికపై మహిళా సంఘాలకు ప్రస్తుతం అందుతున్న రూ.5 లక్షల రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

భ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల చెక్కులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఆర్టీసీ అ÷-దదె బస్సుల హైర్ చార్జీల కింద రూ.20.30 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్ఆర్టీసీకి రూ.199 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అ÷-దదెకిచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు. మహిళల ఆర్థిక భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వినూత్న నమూనా దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు కలిగిన రూ.10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను సభలో వివరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మహిళల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులను ప్రజలకు తెలియజేయనున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మహిళలు తమ సంఘాలకు చెందిన సొంత బస్సుల్లో హైదరాబాద్‌కు చేరుకునేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. తెలంగాణ నలుమూలల నుంచి మహిళా శక్తి ఒకే వేదికపై సమీకృతం కానున్న ఈ మహాసభ, మహిళల ఆర్థిక ప్రగతి ప్రయాణంలో మరో చారిత్రక మైలురాయిగా నిలవనుంది. ÷రిళిమవారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళల రాకపోకలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే భాగస్వాములుగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన, సూక్ష్మ వ్యాపారాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపునకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.

# సంపాదకీయం

## మానని 'మణిపూర్' గాయం!




జాత్యాహంకార ఘర్షణలతో మూడేండ్ల నుంచి మండుతున్న మణిపూర్‌లో మంటలు చల్లారడం లేదు. ఇటీవల ఒక్కసారిగా మళ్లీ అశాంతి చెలరేగింది. ఇటీవల గుర్తుతెలియని దుండగుల దాడుల్లో ముగ్గురు కుకీలు ప్రాణాలు కోల్పోయారు. ఇది ముమ్మాటికీ మైతీలు చేసిన హత్యలేనని కుకీలు ఆరోపించారు. రెండు తెగల మధ్య ప్రారంభమైన వైరం దేశ రాజకీయాలనే ప్రభావితం చేసింది. ఇక్కడ మరో ఆందోళనకరమైన అంశం, ఇద్దరు మహిళ కుకీలను వివస్త్రలు చేసి నడిపించిన ఘటన. ఇది సభ్య సమాజాన్నే తలదించుకునేలా చేసింది. అప్పట్లో దేశవ్యాప్తంగా ఆగ్రహావేశాలు కూడా వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ కేంద్ర, రాష్ట్ర పాలకులు గుణపాఠం నేర్చుకున్నట్లు కనిపించడం లేదు. ఎందుకంటే, నేటికీ అలాంటి అమానవీయ ఘటనలు చోటుచేసుకోవడం రాష్ట్రంలో చట్టపరమైన రక్షణ వ్యవస్థ ఎంతగా దెబ్బతిందో తెలియజేస్తోంది. ఇది బీజేపీ పాలనా వైఫల్యానికి నిదర్శనం. మణిపూర్ సంక్షోభాన్ని కేవలం తాజా ఘటనలతో అర్థం చేసుకోలేము. దాని వెనుక దశాబ్దాల చరిత్ర ఉంది. లోయ ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఉండే మైతీలు, కొండ ప్రాంతాల్లో నివసించే కుకీ–జో– నాగ తెగల మధ్య భూ హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, అటవీ వనరులు, పరిపాలనా అధికారాల విషయంలో చాలాకాలంగా విభేదాలు ఉన్నాయి. అయితే 2023లో మైతీలకు షెడ్యూల్ ట్రైబ్ హోదా కల్పించాలని వచ్చిన డిమాండ్ నేపథ్యంలో మొదలైన వివాదం క్రమంగా జాతి ఘర్షణగా మారి రక్తపాతానికి దారితీసింది. సున్నితంగా పరిష్కరించాల్సిన సమస్యను ప్రభుత్వం భద్రతా సమస్యగా చూపింది. కానీ, దీనివెనుక కేంద్ర సర్కార్ కుట్ర దాగుంది. కుకీలున్న కొండ ప్రాంతాల్లో నిలువైన ఖనిజ నిక్షే?పాలను బడా పెట్టుబడిదారులైన అదానీ, అంబానీలను కట్టబెట్టే ప్రయత్నంలో రెండు తెగల మధ్య చిచ్చు రాజేసింది. కుకీలను అక్కడి నుంచి తరిమేయాలని పథకం వేసింది. ఫలితంగా ఇప్పుడు రాష్ట్రమే రెండు భాగాలు చీలిపోయి, రావణకాష్టంలా మండుతోంది. ఈ ఘర్షణలో ఇప్పటివరకు రెండు వందల యాభైకి పైగా ప్రాణాలు కోల్పోయారు. పదివేల ఇళ్లు తగులబడ్డాయి. దాదాపు అరవై వేల మంది నిరాశ్రయులయ్యారు. సాధారణ ప్రజల జీవితాలు అస్తవ్యస్తమయ్యాయి. అనేక కుటుంబాలు ఇప్పటికీ సహాయక శిబిరాల్లోనే జీవిస్తున్నాయి. అక్కడ హింస చెలరేగిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విశ్వాసాన్ని కోల్పోయింది. ముఖ్యమంత్రి బీరెన్‌సింగ్ మెయితీ వర్గానికి అనుకూల వైఖరి తీసుకోవడం సమస్యను జటిలం చేసింది. కుకీల విశ్వాసాన్ని కోల్పోవడంతో ఆయన పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. అనంతరం కొద్దికాలం రాష్ట్రపతి పాలన కొనసాగింది. ముఖ్యమంత్రిని మార్చడం, రాష్ట్రపతి పాలన విధించడం వల్ల సమస్య పరిష్కారం కాలేదు. నేటికీ హత్యలు, దాడులు, నిరసనలు కొనసాగుతుండటం సంక్షోభం పరిపాలనా స్థాయిని దాటి, రాజకీయ, సామాజిక స్థాయికి చేరుకుంది. ఇదంతా చూసినప్పుడు బీజేపీ తరచూ ప్రచారం చేసే "డబుల్ ఇంజన్" సర్కార్ మణిపూర్‌లో పూర్తిగా బోల్తా పడింది. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి, శాంతి, సమన్వయం మెరుగ్గా ఉంటా యని చెప్పిన బీజేపీ, మణిపూర్ ప్రజలకు కనీస భద్రతను కూడా కల్పించలేక పోయింది. రాష్ట్రం నెలల తరబడి అగ్నిగుండంలా మారినా ప్రధాని ఆ సమయంలో విదేశాల్లో పర్యటించడం, ప్రత్యక్ష? జోక్యం లేకపోవడం పట్ల ప్రతిపక్ష?ల నుంచి తీవ్రమైన నిరసన గళం వినిపించింది. పార్లమెంట్‌లో చర్చకు పట్టుబట్టింది. అయినప్పటికీ బాధిత ప్రాంతాలను సందర్శించడంలో కేంద్ర నాయకత్వం పూర్తిగా విఫలమైందని నేటికీ రాజకీయ విశ్లేషకుల విమర్శ. ఈ సంక్షోభంలో అత్యంత ఆందోళనకరమైన అంశం జాతి, మత, ప్రాంతీయ గుర్తింపులను రాజకీయంగా వినియోగించే ధోరణి. ప్రజల మధ్య ఉన్న భిన్నత్వాన్ని గౌరవించి ఐక్యతను పెంపొందించాల్సిన పాలకులు దాన్ని విస్మరించడం. మణిపూర్‌లో క్రైస్తవాన్ని ఆధారంగా చేసుకుని బతుకుతున్న ఆదివాసీ కుకీలపై అన్యమత ప్రచారంతో రెచ్చగొట్టడం పాలకుల విభజన రాజకీయాన్ని బహిర్గతం చేసింది. ఒక వర్గం భయాలను మరో వర్గంపైకి మళ్లించడం, సామాజిక విభేదాలను రాజకీయ లాభాల కోసం ఉపయోగించుకోవడం తాత్కాలికంగా ఓట్లు తెచ్చిపెట్టవచ్చు. కానీ చివరకు సమాజాన్ని విచ్ఛిన్నం చేస్తుంది. మణిపూర్‌లో నేడు కనిపిస్తున్న పరిస్థితి అదే. పక్కపక్కనే నివసించిన ప్రజలు ఒకరినొకరు అను మానంతో చూసే స్థితికి చేరుకున్నారు. సామాజిక సంబంధాలు తెగిపోయాయి. ఇది కేవలం మణిపూర్‌కే పరిమితమైన సమస్య కాదు, దేశ సమైక్యతకు ముప్పు. భారతదేశం అనేక జాతులు, మతాలు, భాషలు, సంస్కృతుల సమ్మేళనమన్న విషయాన్ని పాలకులు మరవరాదు. ఈ వైవిధ్యమే మన దేశ బలం. దాన్ని రాజకీయ లాభాల కోసం విభజనకు ఆయుధంగా మారిస్తే దేశ భవిష్యత్తుకే ప్రమా దకరం. మణిపూర్ మంటలు హెచ్చరించేది అదే. ద్వేషం, విద్వేషం, విభజన రాజకీయాలు చివరకు ప్రజల ప్రాణాలను బలిగొంటాయి. దేశం ఈ విషయాన్ని విస్మరిస్తే, మణిపూర్ లాంటి విషాదాలు మళ్లీమళ్లీ పునరావృతమవుతూనే ఉంటాయి.

# ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే సత్యనారాయణ



**మానకొండూర్, 8 జూన్ (మహాప్రభ)**
: హైదరాబాద్ గాంధీ భవన్‌లో నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రజల సమస్యలను నేరుగా ఆలకించి స్పందించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 43 మంది ఫోన్ ద్వారా పాల్గొని ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, విద్యుత్ సమస్యలు, పింఛన్లు, సంక్షేమ పథకాలు, వ్యవసాయ ఇబ్బందులు, రెవెన్యూ సమస్యలు వంటి అంశాలను ప్రస్తావించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, కొన్ని అంశాలపై వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, మండల స్థాయి అధికారులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, వ్యవసాయ కళాశాల, 50 పడకల ఆస్పత్రి వంటి ప్రాజెక్టులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు విపరీతమైన డిమాండ్ పెరిగిందని, అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కవ్వంపల్లి స్పష్టం చేశారు.

# రైతులకు సమగ్ర వ్యవసాయ పద్ధతులపై అవగాహన సదస్సు




**హుస్నాబాద్, 8 జూన్ (మహాప్రభ)**
ఏల్ నినో ప్రభావంతో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఎదురవుతున్న నేపథ్యంలో రైతులు సమగ్ర వ్యవసాయ విధానాన్ని అలవర్చుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ వాణి సూచించారు. మీర్జాపూర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేపట్టాలని, పప్పుధాన్యాలు, కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డీపీఎం వాసుదేవ్ మాట్లాడుతూ పల్లె మహిళా జీవనోపాధి కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, పనిముట్లు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఏపీఎం తిరుపతి భూసారాభివృద్ధి, చెరువుల పూడిక తొలగింపు పనులు చేపట్టినట్లు, అలాగే ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు దిశగా రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వాసన్ ఎన్జీవో ప్రతినిధి అనిల్ సమగ్ర నివేదిక ఆధారంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని తెలిపారు. వ్యవసాయ అధికారి పూజ రైతులందరూ పంట మార్పిడి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచ్ సంపత్ కుమార్, జవహర్, బిక్షపతి, ఏఈవో సంగీత, ఉపసర్పంచ్ లుస్వర్ణకుమార్, వీవో అధ్యక్షులు వాణి, భారతి, శారద, వీవోఏలు సుదర్శన్, సునీత, నిర్మలతో పాటు మహిళలు, రైతులు పాల్గొన్నారు. పంట మార్పిడి ద్వారా సమగ్ర వ్యవసాయం రైతులకు స్థిరమైన ఆదాయం కల్పిస్తుందని అధికారులు సూచించారు.

# నంద్యాల జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం

### మంత్రులు, ప్రజాప్రతినిధులతో సమగ్ర చర్చ




**నందికొట్కూరు, 8 జూన్ (మహాప్రభ)**
నంద్యాల పట్టణంలో సోమవారం జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్తో పాటు నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా అభివృద్ధి కోసం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష జరిగింది. భవిష్యత్తులో నందికొట్కూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రణాళికలపై అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో రోడ్లు--భవనాల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ ఫరూఖ్, నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షురాలు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ డిమాండ్




**హుస్నాబాద్, 8 జూన్ (మహాప్రభ)**
ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని, అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ హుస్నాబాద్ నగర కార్యదర్శి బత్తుల రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల వనరుల కేంద్రంలో వినతిపత్రం సమర్పించారు. జూన్ 15 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ముందుగానే అందుబాటులో ఉండాలని ఆయన కోరారు. మరుగుదొడ్ల శుభ్రత, కొత్త మరుగుదొడ్ల నిర్మాణం, తరగతి గదుల్లో బల్లలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ, పుస్తకాలు ఇష్టారాజ్యంగా విక్రయించడం ద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆయన ఆరోపించారు. సరైన మౌలిక వసతులు లేకపోయినా యథేచ్ఛగా నిర్వహిస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నగర ఉపాధ్యక్షులు సంతోష్, అంజి, సంయుక్త కార్యదర్శులు రంజిత్, చరణ్ తదితరులు పాల్గొన్నారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది.

# విద్యే శక్తి, విద్యే భవిష్యత్తు -- బడిబాటే ఆ భవిష్యత్తుకు బంగారు బాట



**కరీంనగర్, 8 జూన్ (మహాప్రభ)**
జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో బడిబాట ప్రచార గీతాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆవిష్కరించారు. ప్రతి చిన్నారి పాఠశాల బాట పట్టాలని, ప్రతి గ్రామం విద్యా వికాసానికి నిలయంగా మారాలని సంకల్పంతో రూపొందించిన ఈ గీతం ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే విద్యా ఉద్యమంగా నిలుస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తనాజీ వాకడే, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రశాంత్ రెడ్డి, సమన్వయకర్తలు అశోక్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. జడ్పీహెచ్ఎస్ ఒద్యారం పాఠశాలకు చెందిన మాజీ మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు, రచయిత వెంకటేశ్వర్లు, కె.బి. శర్మ కృషితో ఈ గీతం రూపొందింది. ప్రతి ఇంటి నుండి ఒక అడుగు బడివైపు, ప్రతి గ్రామం నుండి ఒక అడుగు విద్యావైపు అనే సందేశంతో రూపొందిన ఈ గీతం జిల్లావ్యాప్తంగా బడిబాట కార్యక్రమానికి స్ఫూర్తినిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడంలో కీలక పాత్ర పోషించనుంది. విద్యే శక్తి, విద్యే భవిష్యత్తు -- బడిబాటే ఆ భవిష్యత్తుకు బంగారు బాట.

# ఎల్పీజీ ధరలపై కాంగ్రెస్ నిరసన




**కరీంనగర్, 8 జూన్ (మహాప్రభ)**
కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన ఎల్పీజీ గ్యాస్ ధరలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ వద్ద భారీ వంటావార్పు కార్యక్రమం జరిగింది. ఖాళీ సిలిండర్లతో, కట్టెల పొయ్యిలపై వంట చేస్తూ నేతలు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ మాట్లాడుతూ, గ్యాస్ ధరలు ఒకేసారి రూ.29 పెరగడం పేద, మధ్యతరగతి ప్రజలపై భారమని విమర్శించారు. 2014లో రూ.400 ఉన్న సిలిండర్ నేడు రూ.1200 దాటిందని, సబ్సిడీ ఎత్తివేయడంతో మహిళలు మళ్లీ కట్టెల పొయ్యిల వైపు మొగ్గుతున్నారని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న మాట్లాడుతూ, గ్యాస్ ధరల పెరుగుదలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కేంద్రం వెంటనే ధరలు తగ్గించి పాత సబ్సిడీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వెలిచాల రాజేందర్ రావు ఇంటి నుంచి గీతా భవన్ చౌరస్తా వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీగా తరలి వచ్చి నిరసనలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఎల్పీజీ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.

## ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక లో పర్యావరణ వారోత్సవాలు



**దేవరకొండ జూన్ 8 ( మహాప్రభ )** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల లో భాగంగా సోమవారం 17వ వార్డుల్లో ప్రణాళిక పర్యావరణ వారోత్సవాల నిర్వహణలో భాగంగా సంతోష్ మాత, సంజయ్ కాలనీ లో వార్డు సభ ఏర్పాటు చేయనైనది. ఈ కార్యక్రమంలోఎస్ డబ్ల్యూ ఎం నియామకాల 2026 గురించి, వర్షపు నీటి సంరక్షణ, కాలువల శుభ్రత, వర్షాకాల సంసిద్ధత, త్రాగునీరు సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాలు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, గురించి వార్డ్ ఆఫీసర్ పి.నామ ప్రజలకు తెలియజేశారు, అలాగే వార్డు సభకు వచ్చినటువంటి ప్రజలు ముఖ్యంగా సంతోషిమాత కాలనీ, సంజయ్ కాలనీలో కోతుల నుండి మరియు కుక్కల నుండి రక్షణ కల్పించాలని వార్డు ప్రజలు తమ సమస్యలను వాడు సభలో అధికారుల, ప్రజా ప్రతినిధుల, దృష్టికి తీసుకువచ్చారు, ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ పొట్ట మధు , కో- ఆప్షన్ సభ్యులు వైయస్ సిపోరమ్మ కరుణాకర్, మున్సిపల్ అధికారి జి. రాకేష్ కుమార్ వార్డ్ ఆఫీసర్ పి నామ, ఆర్ పి షామా పర్వీన్, అంగన్వాడి టీచర్ బాలమణి, వివిధ సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు,

## ప్రజావాణిలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని నల్గొండ జిల్లా కలెక్టర్‌కు వినతి



**దేవరకొండ ( డివిజన్) 08జూన్ (మహాప్రభ):**
తమకు నివాసం ఉండటానికి స్వంత ఇల్లు లేదని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ నల్గొండ జిల్లా దేవరకొండ మండలం గాంధీనగర్‌కు చెందిన చేరిపల్లి భార్గవి సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధితురాలు భార్గవి (భర్త గోవర్ధన్) మాట్లాడుతూ, తాము గత కొంతకాలంగా గాంధీనగర్ పరిధిలో అద్దె ఇంట్లో నివసిస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దేవరకొండ మండలం గాని, నల్గొండ జిల్లాలో గాని తమకు ఎలాంటి స్వంత ఇల్లు లేదని ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ నిరుపేద పరిస్థితిని పరిశీలించి, మానవతా దృక్పథంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక ఇల్లు మంజూరు చేయాలని ఆమె జిల్లా ఉన్నతాధికారులను వేడుకున్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు స్వయంగా కలిసి దరఖాస్తును అందజేసినట్లు ఆమె పేర్కొన్నారు.

## పేద కుటుంబానికి అండగా ఫౌండేషన్"

**-మనిషికి మనిషే అండ... సేవే గొప్ప ధర్మం "**

**-నిరుపేద ఆడబిడ్డ వివాహానికి రూ.5,000/- హార్దిక సహాయం**



**దేవరకొండ ( డివిజన్) 08జూన్ (మహాప్రభ):**
దేవరకొండ మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన శ్రీమతి నూర్‌జహాన్ కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం అవసరమని తెలుసుకున్న డా. నక్కా అఖిలేష్ యాదవ్ ఫౌండేషన్ స్పందించింది.
ఫౌండేషన్ అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు యాదవ్ ఆధ్వర్యంలో, వుగ్గిడి శ్రవణ్ కుమార్ (సరూర్ నగర్) ఎస్సై చేతులు మీదుగా 5000 రూపాయలు చేతుల మీదుగా సహాయం చేశారు ఈ కార్యక్రమంలో నక్క వెంకటేశ్వర్లు రాచమల్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు సమాజంలో పేద మరియు అవసరం ఉన్న కుటుంబాలకు భవిష్యత్తు ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తాం

## మృగశిర వేళ .. బెల్లం పంపిణీ



**పాపన్నపేట, జూన్ 8 ( మహా ప్రభ )** పల్లెల్లో ప్రతి ఇంటా రుచికరమైన చేపల వంటకాలతో గుమగుమ లాడాయి. మృగశిర కార్తె సందర్భంగా సోమవారం పాపన్నపేట మండల వ్యాప్తంగా గ్రామాలలో సందడి నెలకొంది. పాపన్నపేట లోని సాలం,పాత, వివిధ గ్రామాల చెరువులలో మత్స్యకారులు చేపలను పట్టారు. ఆయా గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి పాపన్నపేట లోని ఓ విక్రయ కేంద్రం వద్ద,నార్సింగి గ్రామ చౌరస్తాలో వివిధ రకాల చేపలను కొనుగోలు చేశారు.
పాపన్నపేటలో విట్ట వెంకటేశం గుప్త ప్రజలకు ఇంగువ బెల్లం పంపిణీ చేశారు .

# తెలంగాణ కీర్తిని దేశవ్యాప్తంగా చాటిన అమ్రాది విశాల్ రెడ్డి.




**ఎల్ బి నగర్ 8 జూన్ (మహాప్రభ)**
జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో అమ్రాది విశాల్ రెడ్డి సాధించిన విశిష్ట విజయం అనేక సంవత్సరాల కఠోర శ్రమ, అచంచల పట్టుదల, క్రమశిక్షణ మరియు అంకితభావానికి ప్రతిఫలంగా నిలిచింది. 2024, 2025 సంవత్సరాలలో నిర్వహించిన తెలంగాణ ముఖ్యమంత్రి కప్ కరాటే ఛాంపియన్‌షిప్‌లలో వరుసగా స్వర్ణ పతకాలు సాధించడం ద్వారా ఆయన తన పోటీతత్వ నైపుణ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకున్నారు. రాష్ట్రంలోని అత్యుత్తమ క్రీడాకారులతో పోటీపడుతూ పొందిన అనుభవం, ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కొనే సామర్థ్యం, విజయం సాధించాలనే సంకల్పం జాతీయ స్థాయిలో ఆయన రాణించడానికి బలమైన పునాదిగా నిలిచాయి. ముఖ్యమంత్రి కప్‌లో సాధించిన విజయాలే జాతీయ ఛాంపియన్‌షిప్‌లో చారిత్రాత్మక స్వర్ణ పతకాన్ని అందుకునే మార్గాన్ని సుగమం చేశాయి. ఇప్పటికే కామన్వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్--2024లో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన విశాల్ రెడ్డి, తాజాగా జాతీయ స్థాయిలో స్వర్ణ పతకం సాధించడం ద్వారా తెలంగాణ యువతలోని ప్రతిభకు ప్రతీకగా నిలిచాడు. ఆయన విజయం రాష్ట్రంలోని యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా మారింది.
తెలంగాణకు ఈ అరుదైన గౌరవాన్ని తీసుకువచ్చిన అమ్రాది విశాల్ రెడ్డి విజయం రాష్ట్ర క్రీడా చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోనుంది. సరైన శిక్షణ, క్రమశిక్షణ, పట్టుదల మరియు అవకాశాలు ఉంటే తెలంగాణ యువత జాతీయ, అంతర్జాతీయ వేదికలపై మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించగలదని ఆయన మరోసారి నిరూపించారు.

# ప్రతి ఒక్కరి ఇంట్లో ఇంకుడు గుంత ఉండాలి

**-వర్షాకాలం ముందు జాగ్రత్తలు తీసుకోవాలి**

**ప్రభుత్వ పథకాల అర్హులందరికీ అందాలి- కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్**

**-ప్రజా ప్రతినిధుల ప్రజల సహకారంతో ముందు జాగ్రత్తలు చేపడతాం- మున్సిపల్ కమిషనర్ రమేష్**




**తూప్రాన్,జూన్ 8 (మహాప్రభ)**
తూప్రన్ మున్సిపాలిటీలోని నాలుగో వార్డు లో ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన లో భాగంగా నాలుగో వార్డ్ లోని ముదిరాజ్ సంఘం వద్ద నిర్వహించారు మున్సిపల్ కౌన్సిలర్ జైపాల్ నాయక్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు కౌన్సిలర్ మాట్లాడుతూ వర్షాకాలకు సీజన్లో ప్రజలు ముందు జాగ్రత్త తీసుకోవాల్సిన జాగ్రత్తలు అలాగే మున్సిపాల్సిన మున్సిపాలిటీ నుంచి కావలసిన జాగ్రత్తలు తెలిపారు వార్డులోని వీధి దీపాలు బాగు చేయాలని అలాగే వర్షపు నీలు ఆగేచోట ముందు జాగ్రత్తలు తీసుకోవాలని నూతన పింఛన్దారులకు నూతన ఇంద్రమ్మ దారులకు అర్హులందరికీ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కు కోరారు అలాగే మున్సిపల్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరికీ అందే విధంగా కృషి చేస్తామని అలాగే వర్షాకాలపు నీళ్లు ఆగేచోట ముందు జాగ్రత్తలు చేపడతామని ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజలందరూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలు అన్ని సౌకర్యాలు ఉన్నాయని ప్రజా ప్రతినిధులు కూడా ప్రభుత్వ పాఠశాల చేర్పించాలని అప్పుడే ప్రభుత్వ విద్యా సంస్థపై నమ్మకం ఉంటుందని ప్రజలు కూడా ఆలోచించి కార్పొరేట్ స్కూల్లోకి వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకి పంపించాలని ప్రజలకు కోరారు ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ మహేష్ కుమార్ జూనియర్ అసిస్టెంట్ ప్రత్యూష వర్క్ ఇన్స్పెక్టర్ వేదాంత అంగన్వాడీ టీచర్ పద్మ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 95 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి

**-చివరి దశలో ధాన్యం కొనుగోళ్లు**

**-అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**-జిల్లా వ్యాప్తంగా 268 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేత**

**--జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**



**మెదక్ జిల్లా -08జూన్ (మహాప్రభ )**
జిల్లా లో ధాన్యం కొనుగోళ్లు 95 శాతం పూర్తి అయినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు.
సోమవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..చివరి దశలో ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని, అకాల వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.
జిల్లా వ్యాప్తంగా 82,251 మంది రైతుల నుంచి 3,80,358 .240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,65,394 మంది రైతులకు 694,32 కోట్ల రూపాయలు చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 268 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు పూర్తి అయిన కేంద్రాల్లోని సిబ్బంది, వాహనాలు, హమాలీనీ ధాన్యం కొనుగోళ్లు నడుస్తున్న కేంద్రాల్లో ఉపయోగించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు అప్రమత్తంగా ఉండి త్వరిత గతిన ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్,సివిల్ సప్లై శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు,ఆర్డీవోలు, తహశీల్దార్లు,ధాన్యం సేకరణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సగర యూత్ సేవాస్ఫూర్తి గుర్తింపు...

**-జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేష్ సగర పిలుపు....**



**రామాయంపేట జూన్ 8 మహాప్రభ**
సగరుల్లో సంఘటిత శక్తి పెరగాలని. ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని అన్ని రంగాల్లో ఉండాలని సాగర సంగం జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కునగేష్ సగర . పిలుపునిచ్చారు ఆదివారం రామాయంపేట చిత్తారమ్మ దేవాలయంలో సగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా నగేష్ సగ ర మాట్లాడుతూ సగర్ లు ఉన్నత విద్య లో దూసుకుపోతున్నారని, సమాజంలో తల ఎత్తుకు తిరిగేలా మన పనితనం ఉండాలన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మర్కుదత్తు సగర మాట్లాడుతూ రామాయంపేట యూత్ సేవలు గొప్పవి. అన్నిరంగ లలో విప్లవ స్ఫూర్తి రావాలని కోరారు స్థానిక సంగం అధ్యక్షుడు మర్కు అజేష్ సగర మాట్లాడుతూ సంఘ బలోపేతానికి నెల నెల సమావేశాలు ముఖ్యం అని తెలిపారు . యువజన సంఘం అధ్యక్షులు మరుగు రాజు సగర మాట్లాడుతూ పెద్దల స్ఫూర్తితో మరింత సేవ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈలో ఉపాధ్యక్షులు రామరపు యాదగిరి సగర . సంఘం నాయకులు వినయ్ సాగర. యువజన సంఘం ఉపాధ్యక్షుడు మార్కు శ్రీకాంత్ సగర . ప్రధాన కార్యదర్శి రామారపు శ్యామ్ రాజ్ సగర కోశాధికారి దోమకొండ శ్రీనివాస్ సగర డైరెక్టర్లు ఎక్కడా వంశీ సగర . ఆర్ అజేష్ సగర లతోపాటు పలువురు యూత్ సభ్యులు పాల్గొన్నారు

## ప్రజావాణిలో ప్రజల సమస్యలు విన్న జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్

**-అందిన ఫిర్యాదులపై సత్వర చర్యలకు అధికారులకు ఆదేశాలు**

**-ప్రజలకు న్యాయం చేయడంలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుంది.**



**మెదక్ జిల్లా - 08జూన్ (మహాప్రభ )**
మెదక్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారునితో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి, వాటిపై సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత సీఐలు, ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ఫిర్యాదుల విషయంలో సంబంధిత ఎస్‌హెచ్‌వోలతో నేరుగా ఫోన్‌లో మాట్లాడి వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు న్యాయం చేయడంలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని ఎస్పీ తెలిపారు. ఎలాంటి మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా పోలీసు అధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. చట్ట ప్రకారం ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి బాధితులకు న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభిస్తోందని, దీంతో పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతోందని ఎస్పీ తెలిపారు.

# ఎల్ఐసి ని వ్యాపార పరంగా అభివృద్ధి లోకి తెచ్చిన, చౌహాన్

**యాఫి నాయకుడు గాజుల రాజేష్, విద్యుత్ శాఖ ఏడి వస్కుల సత్యనారాయణ**



**దేవరకొండ జూన్ 8 ( మహాప్రభ )**
మలక్పేట ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్. రాము చౌహాన్ ను సోమవారం దేవరకొండ లియాఫీ నాయకుడు గాజుల రాజేష్ మరియు విద్యుత్ శాఖ ఏడి వస్కుల సత్యనారాయణలు మలక్పేటలోని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్. రాము చౌహాన్ వారిని ఎంతో ఆదరంగా తన ఛాంబర్‌లోకి ఆహ్వానించి, పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు గాజుల రాజేష్, వస్కుల సత్యనారాయణలు మాట్లాడుతూ... ఎస్. రాము చౌహాన్ గతంలో దేవరకొండ ఎల్ఐసి బ్రాంచ్ ని వ్యాపారపరంగా ఎంతో ఉన్నత స్థానానికి తీసుకెళ్లారని కొనియాడారు. కేవలం ఒక అధికారిలా కాకుండా, ఏజెంట్ల పట్ల, బ్రాంచ్ సిబ్బంది పట్ల ఆయన చూపించే ప్రేమ, ఆప్యాయతలు ఎన్నటికీ మరువలేనివని అన్నారు. తమను సొంత సోదరుడిలా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం ఆయన సంస్కారానికి నిదర్శనమని పేర్కొన్నారు.
రాము చౌహాన్ లాంటి నిబద్ధత, మానవత్వం కలిగిన అధికారులు చాలా అరుదుగా ఉంటారని, ఆయన ఎక్కడ పనిచేసినా ఆ బ్రాంచ్ ఉన్నతికి ఎంతో కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో ఎల్ఐసి వ్యాపారంతో పాటు, తాము కలిసి నిర్వహించిన పలు స్వచ్ఛంద సామాజిక సేవా కార్యక్రమాలను, ఆ తీపి గుర్తులను ఈ సందర్భంగా నెమరువేసుకున్నారు. ఇంతటి మంచితనం కలిగిన వ్యక్తిని సోమవారం కలవడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ మర్యాదపూర్వక సమావేశంలో వీరితో పాటు ముసిని అంజన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత ఆత్మగానం--మంజుల పత్తిపాటి

కష్టాల కడలిలో కరిగే రైతన్న..!
కన్నీటి కాలువలో కలిసే రైతన్న..!

కొనుగోలు కేంద్రాల్లో కాచే నిరీక్షణ..!
కడగండ్ల వానలకు చెదిరే ఆకాంక్షణ..!

రైతే రాజు అన్నారు రైతన్నా..!
గిట్టుబాటు ధరను నిర్ణయించలేని స్థితిలో నీవెన్నన్నా..!

పచ్చని పొలాల వెనుక నీ త్యాగ గాథను ఎవరు గమనించారు..?
ప్రతి గింజలో దాగిన నీ జీవన వ్యథను ఎవరు విన్నారు..?

దేశానికి వెన్నెముకవైన రైతన్నా..!
నీ చిరునవ్వు పూసే ఆ రోజుకై
ఎదురుచూస్తున్న కాలమన్నా ..!

రచన: మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218



# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**
**-స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కలెక్టర్ సమక్షంలో ప్రజావాణి**
**-హాజరైన ఆర్డీఓ పద్మప్రియ.. 21 వినతుల స్వీకరణ**



**దేవరకొండ జూన్ 8( మహాప్రభ )**
ప్రజల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రజల నుండి స్వయంగా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై ప్రజలు ఎంతో ఆశతో ప్రజావాణికి వస్తారని, అధికారులందరూ బాధ్యతగా వ్యవహరించి ఆయా సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు. స్థానిక ఆర్డీఓ శ్రీమతి పద్మప్రియ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని, కలెక్టర్ గారి ఆదేశాల ప్రకారం అందిన వినతులపై తక్షణమే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 21 పిటిషన్లు నమోదయ్యాయి. భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలపై ఎమ్మార్వో విభాగానికి అత్యధికంగా 14 అర్జీలు వచ్చాయి. ఆర్డీఓ పరిధిలోని సమస్యలపై 4 వినతులు వచ్చాయి. పట్టణ పరిధిలోని డ్రైనేజీ, రోడ్ల సమస్యలపై మున్సిపాలిటీ విభాగానికి 2 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ మరియు ఇతర శాఖల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## పెట్రోలు, డీజిల్ ధరలు తగ్గించాలని పిడిశెట్టి రాజు డిమాండ్



**కరీంనగర్, జూన్ 8 ( మహాప్రభ )**
పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరగడం వల్ల రైతులు, చిరు వ్యాపారులు, కార్మికులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సామాజిక కార్యకర్త, కంటస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మొలంగూర్ గ్రామంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు ప్రజలకు అనుగుణంగా ధరలను నియంత్రించాయని, కానీ ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేస్తూ సామాన్యులపై భారాన్ని మోపుతోందని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూరుస్తూ ప్రజలకు అందాల్సిన సంపదను దూరం చేస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు. పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు పాలేపు తిరుపతి ముదిరాజ్, నాయీబ్రాహ్మణ సంఘం నాయకుడు సమ్మయ్య, రానవేణి రమేష్ తదితరులు పాల్గొన్నారు. సామాన్యులపై భారాన్ని తగ్గించేందుకు ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని పిడిశెట్టి రాజు డిమాండ్ చేశారు.

# ప్రతి ఒక్కరి ఇంట్లో ఇంకుడు గుంత ఉండాలి

**-వర్షాకాలం ముందు జాగ్రత్తలు తీసుకోవాలి**
**-ప్రభుత్వ పథకాల అర్హులందరికీ అందాలి**
**- కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్**
**- మున్సిపల్ కమిషనర్ రమేష్.**



**మెదక్ జిల్లా -08 జూన్ (మహాప్రభ )**
మెదక్ జిల్లా మున్సిపాలిటీలోని నాలుగో వార్డు లో ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన లో భాగంగా నాలుగో వార్డ్ లోని ముదిరాజ్ సంఘం వద్ద నిర్వహించారు మున్సిపల్ కౌన్సిలర్ జైపాల్ నాయక్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ రమేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు కౌన్సిలర్ మాట్లాడుతూ వర్షాకాలకు సీజన్లో ప్రజలు ముందు జాగ్రత్త తీసుకోవాల్సిన జాగ్రత్తలు అలాగే మున్సిపాల్సిన మున్సిపాలిటీ నుంచి కావలసిన జాగ్రత్తలు తెలిపారు వార్డులోని వీధి దీపాలు బాగు చేయాలని అలాగే వర్షపు నీలు ఆగేచోట ముందు జాగ్రత్తలు తీసుకోవాలని నూతన పింఛన్దారులకు నూతన ఇంద్రమ్మ దారులకు అర్హులందరికీ ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కు కోరారు అలాగే మున్సిపల్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందరికీ అందే విధంగా కృషి చేస్తామని అలాగే వర్షాకాలపు నీళ్లు ఆగేచోట ముందు జాగ్రత్తలు చేపడతామని ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజలందరూ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలు అన్ని సౌకర్యాలు ఉన్నాయని ప్రజా ప్రతినిధులు కూడా ప్రభుత్వ పాఠశాల చేర్పించాలని అప్పుడే ప్రభుత్వ విద్యా సంస్థపై నమ్మకం ఉంటుందని ప్రజలు కూడా ఆలోచించి కార్పొరేట్ స్కూల్లోకి వెళ్లకుండా ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకి పంపించాలని ప్రజలకు కోరారు ఈ కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ మహేష్ కుమార్ జూనియర్ అసిస్టెంట్ ప్రత్యూష వర్క్ ఇన్స్పెక్టర్ వేదాంత అంగన్వాడీ టీచర్ పద్మ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## ఎన్నికల విధుల బకాయిలు చెల్లించాలని ఫొటోగ్రాఫర్ల నిరసన



**మంచిర్యాల, జూన్ 8 ( మహాప్రభ )**
పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పనిచేసి రెండేళ్లు గడిచినా బకాయిలు అందకపోవడంతో మంచిర్యాల నియోజకవర్గానికి చెందిన ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు కలెక్టరేట్‌లో ఆందోళన చేపట్టారు. ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వి. రాములకు వినతిపత్రం అందజేసి, రూ. 4 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు తెలిపారు. ఎన్నికల సమయంలో నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించినప్పటికీ ఇప్పటివరకు పారితోషికం విడుదల కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అడిషనల్ కలెక్టర్ సమస్యను పరిశీలించి త్వరలోనే బకాయిలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జక్కుల రాజు, కుమారస్వామి, పరమేష్, మల్లేష్, శ్రీనివాస్‌తో పాటు పలువురు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. ఎన్నికల విధులు నిర్వహించి రెండేళ్లు గడిచినా బకాయిలు అందకపోవడం అన్యాయమని ఫొటోగ్రాఫర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పీ ఎం ఏ వై ఇందిరమ్మ ఇళ్ల పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలి

**-బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి.**



**గడ్డి అన్నారం 8 జూన్ (మహాప్రభ)**
సరూర్‌నగర్ మండల తహసీల్దార్ పి వేణుగోపాల్‌ను ఈరోజు ఉదయం బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పీ ఎం ఏ వై మరియు ఇందిరమ్మ ఇళ్ల పథకాల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన వినతిపత్రాన్ని సమర్పించారు.
ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పీ ఎం ఏ వై, ఇందిరమ్మ ఇళ్ల పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హత ఉన్న కుటుంబానికి చేరాల్సిన అవసరం ఉందన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ లో పలువురు నిజమైన అర్హుల పేర్లు లబ్ధిదారుల జాబితాలో లేకపోవడంతో వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారని తెలిపారు. ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో, తాత్కాలిక నివాసాల్లో జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలు ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తున్నప్పటికీ, వారికి అవకాశం దక్కకపోవడం బాధాకరమన్నారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, అభ్యంతరాలను అధికారులు పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించాలని కోరారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించి, నిజంగా ఇల్లు అవసరమైన నిరుపేద కుటుంబాలు, గృహరహితులు, బలహీన వర్గాలకు చెందిన వారికి ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ఒక్క కుటుంబం కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ అంశంపై తహసీల్దార్ పి. వేణుగోపాల్ సానుకూలంగా స్పందించి, ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనలు, ఫిర్యాదులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

# బిజినెస్

## భారీ నష్టాలతో ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు.. కారణాలు ఇవే..!



: పశ్చిమాసియా లో పెరుగుతున్న ఉద్రిక్తతలు, అంతర్జాతీయంగా బలహీన సంకేతాల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ భారీ నష్టాలతో ప్రారంభమయ్యాయి. ముడిచమురు ధరలు భగ్గుమనడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీ కీలక సూచీలు 1 శాతానికి పైగా పతనమయ్యాయి. ఈ ఉదయం ట్రేడింగ్ ప్రారంభమైన వెంటనే సెన్సెక్స్ 800 పాయింట్లకుపైగా నష్టపోయి 73,421 వద్ద ట్రేడ్ అయింది. అలాగే నిఫ్టీ కూడా 286 పాయింట్లు కోల్పోయి 23,080 వద్దకు జారుకుంది.దాదాపు అన్ని రంగాల షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. ప్రధానంగా రియల్టీ, మెటల్, ఆటో, ఐటీ రంగాల షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. రియల్టీ సూచీ దాదాపు 2 శాతం పడిపోగా, మెటల్, ఆటో, ఐటీ సూచీలు 1 శాతానికి పైగా నష్టాలను చవిచూశాయి. నిఫ్టీలో విప్రో, టీసీఎస్, హిందాల్కో ఇండస్ట్రీస్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్ వంటి షేర్లు మేజర్ లూజర్లుగా నిలిచాయి. ఫ్రంట్‌లైన్ సూచీలతోపాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా 1 శాతం మేర పతనమయ్యాయి. మార్కెట్లలో భయానికి సూచికగా భావించే ఇండియా విక్స్ (ఎ×శ) ఏకంగా 15 శాతం పెరిగి 18 స్థాయికి చేరడం ఇన్వెస్టర్లలో నెలకొన్న ఆందోళనను సూచిస్తోంది. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య దాడులు పునరుద్ధరించడం, ఇరాన్‌లోని పలు నగరాల్లో పేలుళ్లు సంభవించాయన్న వార్తలు అంతర్జాతీయంగా ఆందోళనలను పెంచాయి. ఈ ఉద్రిక్తతల కారణంగా హర్మూజ్ జలసంధి ద్వారా జరిగే ముడిచమురు సరఫరాకు అంతరాయం కలుగుతుందనే భయాలు పెరిగాయి. దాంతో అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 4 శాతం పెరిగి బ్యారెల్‌కు 96.90 డాలర్లకు చేరింది. కానీ మధ్యాహ్నానికి మార్కెట్‌లు కాస్త కోలుకున్నాయి. సెన్సెక్స్ నష్టం 420 కి తగ్గింది. అదేవిధంగా నిఫ్టీ ఫిఫ్టీ నష్టం కూడా 140 కి తగ్గింది.

## పశ్చిమాసియా యుద్ధం.. పెరిగిన నిత్యావసర ధరలతో భారతీయుల ఇక్కట్లు

ఇరాన్‌అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా ఇప్పటికే అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగాయి. ఇండియాలో వరుసగా ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. అసలు ఎల్పీజీ సిలిండర్లు దొరకడమే కష్టమైపోయింది. ఇదంతా ఇప్పుడు సామాన్యుడిపై పడుతోంది. నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. దీనికి పశ్చిమాసియా యుద్ధంతోపాటు అనేక కారణాలున్నాయి.ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఇటీవల ఆర్బీఐ వేసిన అంచనాలు, ఈ ఏడాది సాధారణ వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, రూపాయి బలహీనపడటం వంటివి అన్నీ కలిపి ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. చమురు ధరలు పెరగడం కారణంగా ముడి సరుకు ధరలు పెరిగి, ఫలితంగా ఆహార తయారీ సంస్థలకు ఉత్పత్తి వ్యయం పెరుగుతోంది. అలాగే, రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. దీనివల్ల కలిగే నష్టాన్ని కంపెనీలు వినియోగదారులపైకి మళ్లిస్తున్నా. ఆహారోత్పత్తులు, నిత్యావసరాల ధరలు పెంచుతున్నాయి. లేదా వస్తువుల పరిమాణం తగ్గిస్తున్నాయి. అన్నిరంగాలపైనా ఈ ప్రభావం కనిపిస్తోంది. ముఖ్యంగా ముడిసరుకుల



ధరలు, రవాణా చార్జీలు పెరగడం సమస్యగా మారింది. ప్యాకేజింగ్ ఖర్చులు కూడా పెరిగాయి. ఇందుకు అవసరమైన ముడిసరుకులైన ప్లాస్టిక్ ర్యాపర్లు, అట్టలు వంటివి, ఇతర ఉత్పత్తులు కూడా విదేశాల నుంచి రావాలి. వీటి ధరలు కూడా పెరుగుతుండటం కంపెనీలకు భారంగా మారింది. విదేశాల నుంచి రావాల్సిన అనేక సరుకుల రవాణా నిలిచిపోవడం పెద్ద సవాలుగా మారింది. వీటన్నింటినీ ముందుగా ఎదుర్కునేందుకు సిద్ధమైనవి ఎఫ్ఎంసీజీ కంపెనీలే. హిందుస్తాన్ యునీలీవర్, గోద్రేజ్, డాబర్ ఇండియా వంటి కంపెనీలు ఇప్పటికే స్వల్పంగా తమ ఉత్పత్తుల ధరలు పెంచాయి. అలాగే బ్రిటానియా వంటి సంస్థలు తమ ఉత్పత్తుల బరువు, పరిమాణం తగ్గిస్తున్నాయి. రూ.10 నుంచి రూ.20 వరకు ఉండే వస్తువుల ధరలపై ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. వీటి ధరలు పెంచడం ఆయా కంపెనీలకు అంత లాభదాయకం కాదు. అందుకే ఉత్పత్తుల బరువు తగ్గించాలని చూస్తున్నాయి. దీన్ని ష్రింక్‌ఫ్లేషన్ అంటారని మార్కెట్ నిపుణులు అంటున్నారు. ప్రస్తుత సంక్షోభం కారణంగా దేశంలో ఆటోమొబైల్ ఉత్పత్తులైన బైకులు, కార్లపై కూడా పడుతోంది. వాహనాల ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి. విమానాల ఫ్యుయెల్ ధరలు పెరగడంతో చాలా సంస్థలు విమాన సర్వీసుల్ని నిలిపివేశాయి.ఇదే సమయంలో కంపెనీలు తమ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. సిబ్బందికి అనవసర ప్రయాణాల్ని నిలిపివేసింది.అలాగే, మార్కెటింగ్, అడ్వర్‌టైజింగ్ ఖర్చుల్ని కూడా కంపెనీలు తగ్గించుకుంటున్నాయి. కంపెనీలు పెరిగిన ఈ ఖర్చుల్ని తమ వినియోగదారులపైకి మళ్లిస్తున్నాయి. దీంతో సామాన్యుడు ఇబ్బందిపడుతున్నాడు.

## భారీగా తగ్గుతున్న బంగారం ధరలు.. అసలు కారణాలు ఇవే!

**హైదరాబాద్**

బంగారం, వెండి కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు మార్కెట్ ఊరటనిస్తోంది. గత కొంతకాలంగా రికార్డు స్థాయిలకు చేరిన పసిడి ధరలు ప్రస్తుతం దేశీయ మార్కెట్లో తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకుంటున్న వేగవంతమైన మార్పులు, డాలర్ బలోపేతం కావడం వంటి పరిణామాలు దేశీయంగా బులియన్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి.

**తాజా మార్కెట్ ధరల వివరాలు**

మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ లో ఆగస్ట్ ఫ్యూచర్స్ ధరల ప్రకారం ప్రస్తుతం మార్కెట్ కదలికలు ఈ విధంగా ఉన్నాయి:

**24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం:** 10 గ్రాములకు సుమారు 1,56,000 వద్ద ట్రేడ్ అవుతోంది.



**22 క్యారెట్ల ఆభరణాల బంగారం:** 10 గ్రాములకు సుమారు 1,43,000 దగ్గర కొనసాగుతోంది.

**వెండి ధర:** కిలోగ్రాము వెండి ధర దాదాపు 2,64,000 నుండి 2,70,000 మధ్య పలుకుతోంది.

**ధరల పతనానికి ప్రధాన కారణాలు**

అంతర్జాతీయ ఆర్థిక గణాంకాలు: అమెరికా నుండి వచ్చిన బలమైన ఆర్థిక నివేదికలు, ముఖ్యంగా ఉద్యోగ ఖాళీల సంఖ్య పెరగడం వంటి అంశాలు అక్కడి ఆర్థిక వ్యవస్థ స్థిరత్వాన్ని సూచిస్తున్నాయి. ఇది పసిడి లాభాలకు బ్రేక్ వేసింది.

**భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు:** పశ్చిమ ఆసియాలో (మధ్యప్రాచ్యం) నెలకొన్న అస్థిర వాతావరణం, ఇరాన్ పరిణామాలు అంతర్జాతీయంగా పసిడికి కొంత మేర మద్దతు ఇస్తున్నప్పటికీ, లాభాల స్వీకరణ కారణంగా ధరలు స్థిరపడుతున్నాయి.

**కేంద్ర బ్యాంకుల వ్యూహాలు:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంకులు (SBI రీసెర్చ్ నివేదిక ప్రకారం) తమ డాలర్ కాని నిల్వలను వైవిధ్యభరితంగా మార్చుకుంటూ, ట్రెజరీల నుండి బంగారు నిల్వల వైపు మొగ్గు చూపుతున్నాయి. ఇది దీర్ఘకాలంలో ధరలపై ప్రభావం చూపనుంది.

## ముందింది ఫిఫా వరల్డ్ కప్ సంగ్రామం

- -జూన్ 11 నుంచి జులై 19 వరకు టోర్నీ
- -48 జట్లు, 104 మ్యాచ్‌లతో ఫిఫా వరల్డ్ కప్
- -అమెరికా, మెక్సికో, కెనడా దేశాల్లో ఫిఫా సందడి
- -39 రోజులు ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ పండుగ

ఫుట్‌బాల్ ప్రేమికుల కలల వేదిక, ప్రపంచంలోనే అత్యంత ఆదరణ కలిగిన క్రీడా సంబరం ఫీఫా ప్రపంచకప్ మరోసారి సరికొత్త రికార్డులతో మన ముందుకురాబోతోంది. 2026లో జరగబోయే ఈ టోర్నమెంట్ కేవలం ఒక ఆట మాత్రమే కాదు, ఫుట్‌బాల్ చరిత్రలోనే సరికొత్త అధ్యాయం. ఇప్పటి వరకు మనం చూసిన ప్రపంచ కప్‌ల కంటే ఇది భిన్నంగా, భారీగా ఉండబోతోంది. ప్రపంచకప్ ఎందుకు ప్రత్యకమైందో తెలుసుకోవాలంటే ముందుగా దాని పరిమాణాన్ని చూడాలి. గతంలో 32 జట్లు మాత్రమే టోర్నీలో పాల్గొనేవి. కానీ ఈసారి ఏకంగా 48 జట్లు ట్రోఫీ కోసం పోటీ పడబోతున్నాయి. జట్ల సంఖ్య పెరగడంతో మ్యాచ్‌ల సంఖ్య కూడా 104కు చేరుకుంది. ఇది ఫుట్‌బాల్ ప్రపంచంలో అతి పెద్ద, సుదీర్ఘమైన టోర్నమెంట్‌గా నిలవనుంది. సుమారు 39 రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న



క్రీడాభిమానులను ఈ టోర్నీ ఉర్రూతలూగించనుంది. ఈ మెగా టోర్నీకి ఉత్తర అమెరికా ఖండంలోని మూడు దేశాలు కెనడా, మెక్సికో, యునైటెడ్ స్టేట్స్ సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్నాయి. జూన్ 11న మెక్సికో సిటీలోని ప్రతిష్టాత్మకమైన మెక్సికో సిటీ స్టేడియంలో ఘనంగా ప్రారంభంకానుంది. ఆతిథ్య దేశం మెక్సికో తన సొంత గడ్డపై స్థానిక అభిమానుల కేరింత మధ్య తొలి మ్యాచ్ ఆడనుంది. జులై 19న న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో ప్రపంచ విజేత ఎవరో తేలిపోనుంది. ఫుట్‌బాల్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలనే లక్ష్యంతో ఫిఫా జట్ల సంఖ్యను పెంచింది. దీని వల్ల మరిన్ని దేశాలకు ప్రపంచ క్ వేదికపై తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తుంది. ఈ క్రమంలోనే కేప్ వెర్దే, కురాకో, జోర్డాన్, ఉజ్బెకిస్తాన్ వంటి దేశాలు తొలిసారిగా ప్రపంచకప్ బరిలోకి దిగుతున్నాయి. ఇది ఆయా దేశాల్లో ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి గొప్ప ఊతాన్ని ఇస్తుంది. మొత్తం 48 జట్లను 12 గ్రూపులుగా విభజించారు. ఇవి ఏ నుంచి ఎల్ వరకు ఉన్నాయి. ప్రతి గ్రూపులో నాలుగు జట్లు ఉంటాయి. ప్రతి జట్టు తన గ్రూపులోని మిగిలిన మూడు జట్లతో తలపడుతుంది. గతంలో ఉన్న 8 గ్రూపుల స్థానంలో ఇప్పుడు 12 గ్రూపులను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రూపులో నాలుగు జట్లు ఉంటాయి. ప్రతి గ్రూప్ నుంచి మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా నాకౌట్ దశకు చేరుకుంటాయి. వీరితోపాటు, 12 గ్రూపుల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన 8 మూడవ స్థాన జట్లు కూడా నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. దీని వల్ల మొదటిసారిగా ప్రపంచకప్‌లో రౌండ్ ఆఫ్ 32 అనే కొత్త దశను ప్రవేశ పెట్టారు. అంటే టైటిల్ గెలవాలంటే ఒక జట్టు గతంలో లాగా 7 మ్యాచ్‌లు కాకుండా, ఈసారి 8 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంటుంది.

## పాకిస్తాన్ క్రికెట్‌లో ప్రకంపనలు..

### కెప్టెన్, కోచ్‌పై పీసీబీ వేటు?

పాకిస్తాన్ టెస్టు జట్టులో కీలక మార్పులు చేసే విధంగా పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్‌తో జరిగిన సిరీస్‌లో పాకిస్తాన్ 0 - 2తో ఘోర ఓటమిపాలయింది. ఈ సిరీస్‌లో పాకిస్తాన్ ఆటగాళ్లు దారుణంగా విఫలమయ్యారు. ఈ కారణంతో టెస్టు హెడ్ కోచ్, కెప్టెన్లపై వేటు వేయాలన్న ఆలోచనలో పీసీబీ ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే సర్ఫరాజ్ అహ్మద్, షాన్ మసూద్‌ని తమ తమ బాధ్యతల నుంచి తొలగించే అవకాశం ఉంది. పాకిస్తాన్ జట్టులో ఎప్పుడూ ఏదోక ఇష్యూ నడుస్తూనే ఉంటుంది. కెప్టెన్లు, కోచ్ మార్పులో చాలా ఫాస్ట్‌గా ఉండే పీసీబీ ఇప్పుడు పాకిస్తాన్ టెస్టు టీమ్‌పై వేటు వేసేందుకు సిద్ధమైంది. ఇటీవల బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో 0 - 2తో ఘోర ఓటమిపాలయింది. మంచి మంచి ప్లేయర్లు ఉన్నప్పటికీ పాకిస్తాన్ కనీసం ఒక్క మ్యాచ్‌లో కూడా డ్రా చేయలేకపోయింది. దాంతో




జట్టులో కీలక మార్పులు చేసే ఆలోచనలో పీసీబీ ఉన్నట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ టెస్టు జట్టు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, కెప్టెన్ షాన్ మసూద్‌పై వేటు వేసే ఆలోచనలో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఉన్నట్లు సమాచారం. పీసీబీ వర్గాల ప్రకారం.. మాజీ ప్లేయర్లు యూనిస్ ఖాన్, మొహమ్మద్ హఫీజ్‌తో బోర్డు కీలక పదవులపై చర్చలు జరుపుతోంది. బంగ్లాదేశ్ చేతిలో సిరీస్ ఓటమి తర్వాత పాకిస్థాన్ టెస్టు వ్యవస్థలో సమూల మార్పులు చేయాలని పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ సలహాదారులు సూచించినట్లు సమాచారం. వాళ్ల ప్రకారం టెస్టు జట్టు హెడ్ కోచ్ పదవి నుంచి సర్ఫరాజ్ అహ్మద్‌ను తప్పించి, మళ్లీ అండర్ 19, ఏ జట్ల బాధ్యతలు అప్పగించే ప్రతిపాదనలో పీసీబీ ఉంది. అయితే యూనిస్ ఖాన్‌తో ఒప్పందం కుదిరిన తర్వాతే సర్ఫరాజ్‌పై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. సర్ఫరాజ్‌తో పాటు పాకిస్తాన్ టెస్టు కెప్టెన్ షాన్ మసూద్‌ను కూడా మార్చాలని పీసీబీ చూస్తున్నట్లు తెలుస్తోంది. అయితే వెస్టిండీస్, ఇంగ్లండ్ పర్యటనల్లో మరో అవకాశం ఇవ్వాలని మసూద్ బోర్డును కోరినట్లు తెలుస్తోంది. అయితే, మొహమ్మద్ హఫీజ్‌ను చీఫ్ సెలెక్టర్‌గా నియమించడంతో పాటు ఐసీసీ విభాగానికి కూడా బాధ్యతలు అప్పగించే అంశాన్ని పీసీబీ పరిశీలిస్తోంది. కొంతకాలంగా హఫీజ్ క్రికెట్ డిబేట్లలో బోర్డుపై విమర్శలు గుప్పిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇప్పుడు హఫీజ్‌కు పదవి ఇవ్వడం విమర్శలను ఆపేందుకు చేసిన ప్రయత్నంగా కనిపిస్తోందని మరికొందరు అంటున్నారు. మొత్తానికి బంగ్లాదేశ్ సిరీస్ పరాజయం తర్వాత పాకిస్తాన్ క్రికెట్‌లో పెద్ద ఎత్తున మార్పులు జరిగే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# స్పోర్ట్స్

## ఆఫ్ఘనిస్తాన్‌ను దెబ్బతీసిన ఇండియన్ స్పిన్నర్లు..

– ఇన్నింగ్స్ 300 రన్స్ తేడాతో భారీ విజయం




**న్యూ చండీఘడ్:**

భారత్‌తో జరిగిన ఏకైక టెస్టులో ఆఫ్ఘనిస్తాన్ చిత్తుగా ఓడింది. న్యూ చండీఘడ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 300 రన్స్ తేడాతో భారత్ భారీ విక్టరీ సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆఫ్ఘనిస్తాన్ కేవలం 112 పరుగులకే ఆలౌటైంది. ఇవాళ మూడవ రోజు 14 వికెట్లు పడ్డాయి. ఇండియా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 564 రన్స్ చేయగా, ఆఫ్ఘనిస్తాన్ తన తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 152 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత స్పిన్నర్ మానవ్ సుతార్ ఆరు వికెట్లు తీసి ఆఫ్ఘన్ బ్యాటర్లను దెబ్బతీశాడు.అయితే రెండో ఇన్నింగ్స్‌లో ఫాలోఆన్ ఆడిన ఆఫ్ఘనీలు మరీ దారుణంగా చేతులెత్తేశారు. టాపార్డర్ బ్యాటర్ల దాదాపు విఫలం అయ్యారు. ఓపెనర్ అటల్ 42, గుర్బాజ్ 24 రన్స్ చేశారు. 412 పరుగులు వెనకబడి ఫాలోఆన్ ఆడిన ఆఫ్ఘనిస్తాన్ ఎక్కడ కూడా నిలదొక్కుకునే ప్రయత్నం చేయలేదు. స్పిన్‌కు అనుకూలిస్తున్న పిచ్‌పై భారత స్పిన్నర్లు సత్తా చాటారు. ఆఫ్ఘనిస్తాన్ కేవలం 35.3 ఓవర్లలో తన రెండో ఇన్నింగ్స్‌లో 112 రన్స్ చేసి ఆలౌటైంది. మూడో రోజు వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్ కీలక పాత్ర పోషించారు. రెండో ఇన్నింగ్స్‌లో సుందర్ 4, కుల్దీప్ మూడు వికెట్లు తీసుకున్నారు.

# మాస్ లుక్‌లో త్రిగుణ్..

## 'జంగా' మోషన్ పోస్టర్ వైరల్




తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని యాక్టర్ త్రిగుణ్. ఈ టాలెంటెడ్ యాక్టర్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం జంగా. ఈ చిత్రానికి కెవిన్ (గడ్డం శ్రీహరి) కథ, స్క్రీన్ ప్లే అందిస్తూ దర్శకత్వ వహిస్తున్నాడుత్రిగుణ్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ జంగా మోషన్ పోస్టర్ లాంచ్ చేశారు. ఇప్పటివరకు లవర్ బాయ్‌లా కనిపించిన త్రిగుణ్ ఇందులో రా అండ్ రస్టిక్ లుక్‌లో ఊరమాస్‌గా కనిపించబోతున్నట్టు మోషన్ పోస్టర్ చెబుతోంది. షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రానికి కృష్ణ సౌరభ్ సంగీతాన్ని అందిస్తున్నాడు. ప్రసాద్ వర్మ, ప్రేమ్ రాజ్ మాటలు రాయగా.. కాసర్ల శ్యాం, పూర్ణాచారి, కళ్యాణ్ చక్రవర్తి పాటలు రాస్తున్నారు. ఈ మూవీని వనిత కిలారి సమర్పణలో ఆర్‌కే ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్‌పై రమ్య కిలారి, జయ చంద్ర నాయుడు కిలారి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నేహా పఠాన్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. వరలక్ష్మి శరత్‌కుమార్, శ్రావణ్, మధునందన్, గగన్ విహారి, సమీర్, రఘుకారుమంచి, రచ్చ రవి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# స్టన్నింగ్‌గా విజయ్ సేతుపతి స్లమ్‌డాగ్ - - 33 టెంపుల్ రోడ్ టీజర్



టాలీవుడ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబోలో వస్తోన్న చిత్రం 'స్లమ్‌డాగ్ -- 33 టెంపుల్ రోడ్' . పాన్ ఇండియా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు.ఒక్క వాన పడితే కాకుల్లా చెట్ల కింద దాక్కునే జీవితాలు మావి అలాంటి మా బతుకులతో ఆడితే నేనెందుకు వదులుతా అంటూ గూస్ బంప్స్ తెప్పించే డైలాగ్‌తో షురూ అయింది టీజర్. స్టన్నింగ్ యాక్షన్ సీక్వెన్స్ తో సాగుతున్న టీజర్‌లో అరేయ్ దొంగ నాకొడుకా అంటూ వాయిస్ ఓవర్ వినిపిస్తుంది. మొత్తానికి పూరీ జగన్నాథ్, ఈ సారి విజయ్ సేతుపతితో గట్టి ప్లానే సెట్ చేశాడని టీజర్ చెప్పకనే చెబుతోంది. ఈ చిత్రానికి రమీ సంగీతం అందిస్తున్నాడు. పూరి కనెక్ట్స్, జె.బి. మోషన్ పిక్చర్స్ బ్యానర్లపై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్, జె.బి. నారాయణరావు కొండ్రోళ్ల సంయుక్తంగా నిర్మిస్తుండగా, ఛార్మి కౌర్ సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నారు. విజయ్ సేతుపతికి జోడీగా సంయుక్తా మీనన్ నటిస్తుండగా.. టబు, దునియా విజయ్, బ్రహ్మాజీ, వి.టి.వి. గణేష్, విష్ణు రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్‌లో తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది

# ఇండస్ట్రీలో అది గోల్డెన్ రూల్

సాంఘిక మాధ్యమం అనేది పరిశ్రమలో చాలామందికి వ్యసనంగా, ఇంకా చెప్పాలంటే శాపంగా మారిందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రష్మిక మందన్నా అన్నారు. సోషల్ మీడియాలో నెగెటివిటీ గురించి మాట్లాడుతూ ఆమె పై రీతిగా స్పందించారు. 'పాజిటివ్ కామెంట్స్ వందల్లో ఉన్నప్పటికీ, ఎక్కడో ఒక మూల ఉన్న నెగెటివ్ కామెంట్ మనశ్శాంతిని పూర్తిగా దెబ్బతీస్తుంది. రోజంతా పడ్డ కష్టాన్ని, తద్వారా వచ్చిన ఆనందాన్ని క్షణాల్లో మాయం చేస్తుంది.సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే నేనూ.. నా సినిమాలు విడుదలైన సమయంలో విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటూ ఉంటాను. రిలీజ్ రోజులో పగటిపూట వాతావరణం చాలా బావుంటుంది. కామెంట్లన్నీ సానుకూలంగా కనిపిస్తాయి. రాత్రి 9గంటలు దాటాక నెగెటివిటీ, ట్రోలింగ్ ఒక్కసారిగా పెరుగుతుంది. రోజంతా ప్రశాంతంగా ఉన్న నెటిజన్లు, రాత్రి కాగానే ఎందుకు అంతలా మారిపోతారో అర్థంకాదు. దీనివల్ల రాత్రి 9గంటలు దాటాక ఎట్టి పరిస్థితుల్లోనూ సోషల్ మీడియా ఓపెన్ చేయకూడదనేది ఇండస్ట్రీలో గోల్డెన్ రూల్‌గా మారింది' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు రష్మిక మందన్నా.




# పెద్ది కలెక్షన్ల సునామీ

## 300 కోట్ల వసూళ్లకు చేరువలో వసూళ్లు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ప్రదర్శన కొనసాగిస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే రికార్డు స్థాయి వసూళ్లు సాధిస్తున్న ఈ చిత్రం, ప్రపంచవ్యాప్తంగా కలెక్షన్ల వర్షం కురిపిస్తూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్య పరుస్తోంది. విడుదలైన మొదటి రోజే 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా రూ.135.36 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ఆ తర్వాత రెండో రోజు రూ.46.44 కోట్లు, మూడో రోజు రూ.54.90 కోట్లు రాబట్టిన ఈ చిత్రం, తొలి మూడు రోజుల్లోనే రూ.236.7 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ఆదివారం కూడా అదే జోరు కొనసాగించిన 'పెద్ది' మొదటి వీకెండ్ ముగిసే సరికి ప్రపంచవ్యాప్తంగా రూ.292.5 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించినట్లు చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేస్తూ, సినిమాను 'బాక్సాఫీస్ ఛాంపియన్'గా అభివర్ణించింది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ చిత్రం అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి కీలక మార్కెట్లలో రామ్ చరణ్‌కు ఉన్న క్రేజ్ మరోసారి ఈ వసూళ్ల ద్వారా స్పష్టమైంది. నాలుగు రోజుల్లోనే దాదాపు రూ.300 కోట్లకు చేరువైన ఈ సినిమా, వీక్‌డేస్‌లో కూడా ఇదే స్థాయిలో కలెక్షన్లు కొనసాగిస్తే త్వరలోనే రూ.500 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ 'అచ్చియమ్మ' పాత్రలో నటించారు. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ కీలకమైన కోచ్ పాత్రలో కనిపించగా, జగపతిబాబు 'అప్పలసూరి'గా, దివ్యేందు శర్మ మరో ముఖ్యమైన పాత్రలో నటించారు.

# రామాయణంలో భాగం కావడం అదృష్టం: కాజల్



సినీప్రియులందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే ఉంది. బాలీవుడ్‌లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతోన్న ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్.. రాముడి పాత్రలో, సీతగా సాయి పల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. విలక్షణ నటుడు యశ్.. రావణుడిగా కనిపించనున్నారు. ఆయన సతీమణి మండోదరి పాత్రలో కాజల్ నటించనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఓ అవార్డు వేడుకకు హాజరైన కాజల్ ఈ సినిమా గురించి మాట్లాడారు. తన కెరీర్లోనే ఇలాంటి బిగ్ ప్రాజెక్ట్ చేయడం మొదటిసారి అని అన్నారు. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. భారీ స్థాయిలో 'రామాయణ' రానుంది. గతంతో నితేశ్ తివారీఈ చిత్రం గురించి మాట్లాడుతూ.. 5వేల సంవత్సరాలకు పైగా కోట్లాది హృదయాలను పాలిస్తున్న ఈ ఇతిహాసాన్ని తెర పైకి తీసుకురావడానికి దశాబ్దం నుంచి అన్వేషణ ప్రారంభించాం. మా చిత్రబృందం ఈ చిత్రం కోసం విశ్రాంతి తీసుకోకుండా పనిచేస్తూనే ఉంది. 2026 దీపావళికి మొదటి భాగం, 2027 దీపావళికి రెండో భాగాన్ని విడుదల చేయబోతున్నాం' అని అన్నారు. ఈ ఏడాది దీపావళికి మొదటి భాగం విడుదల కానుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com